**విలేఖరులు కావలెను**

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

# జనసముద్రం న్యూస్

నిరంతర వార్తా ప్రవాహం

ప్రతి అక్షరం జనం కోసం






JANASAMUDRAM.COM

సంపుటి: 03 | సంచిక :173 | గురువారం, జనవరి 23, 2025 | ఎడిటర్: వేణుగోపాల్‌రెడ్డి | పేజీలు : 8 | వెల: రూ.2


# దావోస్‌లో రికార్డుస్థాయి పెట్టుబడులు

**45,500 కోట్ల మేర సన్ పెట్రోకెమికల్స్ ఒప్పందం**

**నాగర్ కర్నూల్, మంచిర్యాల, ములుగులో ప్రాజెక్టులు**

**నగరంలో 10వేల కోట్లతో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్**

**ఏర్పాటు చేసేందుకు కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ రెడీ**

**800 కోట్లతో జేుసడబ్ల్యూ యూఏఎస్ యూనిట్**

**హైటెక్‌సిటీలో 3.2 లక్షల చదరపుటడుగుల్లో**

**హెచ్‌సీఎల్ కొత్త క్యాంపస్.. 5 వేల ఉద్యోగాలు**

**తెలంగాణ అంటేనే బిజినెస్.. పెట్టుబడులతో రండి**

**పారిశ్రామికవేత్తల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి**




హైదరాబాద్, జనవరి 22 : దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికపై తెలంగాణ కొత్త రికార్డు నమోదు చేసింది. గతంలో ఎన్నడూ లేనంతగా.. ఒకేరోజు రూ.56,300 కోట్ల పెట్టుబడులకు సంబంధించి దిగ్గజ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. వాటిలో ముఖ్యమైనది.. ఇంధన రంగంలో దేశంలోనే పేరొందిన సన్ పెట్రో కెమికల్స్ సంస్థ రాష్ట్రంలో భారీ పంప్డ్ స్టోరేజీ జలవిద్యుత్తు, సౌర విద్యుత్తు ప్రాజెక్టుల ఏర్పాటుకు చేసుకున్న రూ.45,500 కోట్ల ఒప్పందం. సన్ పెట్రో కెమికల్స్ ఎండీ దిలీప్ సాంఘ్వీతో సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు బుధవారం సమావేశమయ్యారు. అనంతరం కంపెనీ కొత్త పెట్టుబడులు ప్రకటించింది. సీఎం రేవంత్ సమక్షంలో దావోస్ సదస్సులో రాష్ట్రప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రంలోని నాగర్ కర్నూలు, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో మూడు చోట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రో పవర్ ప్రాజెక్టులను నెలకొల్పుతామని కంపెనీ ప్రకటించింది. ఈ మూడు ప్రాజెక్టుల మొత్తం ఇంధన సామర్థ్యం 3400 మెగావాట్లు. వీటికి 5440 మెగావాట్ల సామర్థ్యం ఉండే సౌర విద్యుత్తు ప్లాంట్లను అనుసంధానం చేస్తుంది. ఈ ప్రాజెక్టుల నిర్మాణ దశలోనే దాదాపు 7వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయని కంపెనీ తెలిపింది. తెలంగాణ ఆవిర్భావం అనంతరం నుంచి ఇప్పటివరకు దావోస్ వేదికపై తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న భారీ ఒప్పందం ఇదే కావడం విశేషం. కాగా.. సుస్థిరమైన ఇంధన వృద్ధి సాధించాలన్న తెలంగాణ లక్ష్య సాధనలో ఈ ఒప్పందం మైలురాయిగా నిలుస్తుందని సీఎం రేవంత్ అన్నారు. ఈ ఒక్క ఒప్పందంతో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం.. నిరుడు దావోసలో సాధించిన రూ.40 వేల కోట్ల పెట్టుబడుల రికార్డును సమం చేసిందన్నారు. భవిష్యత్తు ఇంధన అవసరాల దృష్ట్యా క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీకి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. ఈ ఒప్పందంతో రాష్ట్ర యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు రావడంతోపాటు నాగర్‌కర్నూల్, మంచిర్యాల, ములుగు జిల్లాలు పారిశ్రామికంగా వృద్ధి చెందుతాయన్నారు. తెలంగాణలో రూ.10 కోట్ల పెట్టుబడితో కృత్రిమమేధ డేటాసెంటర్ క్లస్టర్‌ను నెలకొల్పేందుకు.. కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ)


(మిగతా 2వ పేజీలో)




# మాతో కలిసి రండి

**బిల్‌గేట్స్‌కు బాబు ఆహ్వానం.. ఆరోగ్యం, విద్య ఆవిష్కరణలకు ప్రాధాన్యం**

**ఏఐ వర్సిటీ సలహా మండలిలో చేరండి**

**గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం కోసం**

**ఆంధ్రప్రదేశ్ ఎదురు చూస్తోంది**

**సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ హెల్త్**

**ఇన్నోవేషన్ డయాగ్నస్టిక్స్ పెట్టండి**

**మైక్రోసాఫ్ట్ అధినేతను కోరిన సీఎం**

**ఐటీ అభివృద్ధికి సహకరించండి**

**గేట్స్ ఫౌండేషన్ కార్యక్రమాలకు**

**ఏపీని గేట్‌వేగా నిలపండి**

**బిల్‌గేట్స్‌తో భేటీలో మంత్రి లోకేశ్**

అమరావతి, జనవరి 22 : ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య, విద్య ఆవిష్కరణల కేంద్రంగా మార్చేందుకు సహకరించాలని ప్రపంచ ఐటీ దిగ్గజం, మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఏపీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ హెల్త్ ఇన్నోవేషన్, డయాగ్నస్టిక్స్‌ను ప్రారంభించాలని, ఈ కేంద్రం ప్రజలకు అధునాతన ఆరోగ్య సదుపాయాలు అందించేలా తీర్చిదిద్దాలన్నారు. దావోసలో బిల్‌గేట్స్‌తో సీఎం చంద్రబాబుతో పాటు రాష్ట్ర ఐటీ మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. బుధవారం దావోస్ ప్రొమెనేడ్ మైక్రోసాఫ్ట్ కేఫ్‌లో ఈ భేటీ జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా ఉన్నప్పుడు తమపై నమ్మకంతో మైక్రోసాఫ్ట్ ఐటీ కేంద్రాన్ని నెలకొల్పడంతో హైదరాబాద్ రూపురేఖలు మారిపోయిన విషయాన్ని బిల్‌గేట్స్‌కు చంద్రబాబు గుర్తుచేశారు. ఏపీలో ఏర్పాటు చేయనున్న కృత్రిమమేధ యూనివర్సిటీ సలహాదారుల మండలిలో భాగస్వామ్యం కావాలని గేట్స్‌ను చంద్రబాబు


(మిగతా 2వ పేజీలో)




# జవహర్ జాన్‌పహాడ్ ఎత్తిపోతలకు అదనంగా రూ.100కోట్లు

**బెట్టెతండాలో మూసీనదిపై**

**చెక్‌డ్యామ్‌కు రూ.7.5 కోట్లు**

**అధికారుల సమవేశంలో**

**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

పాలకవీడు, జనవరి 22 : జవహర్ జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకానికి అదనంగా రూ.100కోట్లు, బెట్టెతండాలో మూసీ నదిపై చెక్‌డ్యాంకు రూ.7.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టులపై మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో అధికారులు, మండల మాజీ ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ173 కోట్లతో 5650 ఎకరాల పంట సాగు కోసం నిర్మించనున్న జావహార్ జాన్‌పహాడ్ లిఫ్ట్‌కు మరో రూ.100 కోట్లు కేటాయించినట్లు ప్రకటించారు. దీంతో ఈ లిఫ్ట్


(మిగతా 2వ పేజీలో)


# ఒక రైలు దిగి.. మరో రైలు కింద నలిగి..

# 12 మంది దుర్మరణం

**పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలు చక్రాల వద్ద నిప్పురవ్వలు.. అగ్నిప్రమాదం అంటూ వదంతులు**

**చైన్ లాగి కిందకు దిగిన 50 మంది.. అటుగా వచ్చిన కర్ణాటక ఎక్స్‌ప్రెస్ ఢీ**

**12 మంది అక్కడికక్కడే మృతి.. ఛిద్రమైన శరీరాలు**

**మరో 10 మందికి గాయాలు: ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి.. మహారాష్ట్ర జాల్గావ్‌లో ఘటన**



ముంబై, జనవరి 22: మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లా పరందా రైల్వే స్టేషన్ సమీపంలో ఘోరం జరిగింది. పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న కొందరు ప్రయాణికులు బోగీకి నిప్పంటుకుందనే వదంతులతో కిందకు దూకారు. అటుగా వచ్చిన కర్ణాటక ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో 12 మంది అక్కడికక్కడే మృతిచెందగా.. 35 మంది గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో ఓ బాలుడు, ముగ్గురు మహిళలున్నారు. ఈ ఘటనపై జల్గావ్ ఎస్పీ డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన అందజేసిన వివరాల ప్రకారం.. జల్గావ్ నుంచి బయలుదేరిన పుష్పక్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 5 గంటల సమయంలో పరందా స్టేషన్ సమీపానికి రాగానే.. జనరల్ బోగీ చక్రాల వద్ద నిప్పురవ్వలు


(మిగతా 2వ పేజీలో)




# పంచాయతీ ప్రక్షాళన

**ఒకే గొడుగు కిందకు వ్యవస్థలు**

**జిల్లాల్లో ఒకే చోట కార్యాలయాలు**

**సంస్కరణలకు సంఘాలు ఓకే.. ఏకగ్రీవ ఆమోదం**



# ఢిల్లీలో ఆప్ ఓటమి ఖాయం: మోదీ

# మాతో కలిసి రండి

ఆహ్వానించారు. అంతర్జాతీయ ఆవిష్కరణలను స్థానికంగా వినియోగించుకునేలా బిల్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ ద్వారా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బిల్ మిలిందా గేట్స్ ఫౌండేషన్‌కు దక్షిణాది రాష్ట్రాలకు ఏపీని ముఖద్వారంగా చేసుకునేందుకు పూర్తిగా సహకరిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్ర పురోగతిలో బిల్ మిలిందా గేట్స్ భాగస్వామ్యం కోసం ఏపీ ఎదురు చూస్తోందన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఏపీలో ఐటీ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని మంత్రి లోకేశ్ బిల్‌గేట్స్‌ను కోరారు. ఏపీలో ఏర్పాటు చేయబోతున్న ప్రపంచ స్థాయి ఏఐ యూనివర్సిటీ సలహా మండలిలో భాగస్వామ్యం కావాలని గేట్స్‌ను ఆహ్వానించారు. ఆఫ్రికాలో హెల్త్ డ్యాష్ బోర్డుల తరహాలో ఏపీలోనూ ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ ఎకో సిస్టమ్‌ను ఏర్పాటు చేయడానికి బిల్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ తరఫున నైపుణ్య సహకారాన్ని అందించాలని కోరారు. ఫౌండేషన్ కార్యకలాపాలకు ఏపీని గేట్‌వేగా చేసుకోవాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఈ భేటీపై బిల్‌గేట్స్ స్పందిస్తూ.. విజనరీ లీడర్ చంద్రబాబును చాలాకాలం తర్వాత కలవడం ఆనందంగా ఉందన్నారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తమ నుంచి సానుకూల స్పందన ఉంటుందని హామీ ఇచ్చారు. చాలా రోజుల తర్వాత బిల్‌గేట్స్‌ను కలవడం తనకూ ఆనందంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు.



### యూనీలీవర్ చీఫ్‌తో బాబు భేటీ

ప్రపంచవ్యాప్తంగా వినియోగ వస్తువులు విక్రయించే యూనీలీవర్ చీఫ్ సప్లయ్ చైన్ ఆఫీసర్ విల్లెం ఉజ్జెన్‌తో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఏపీలో హిందూస్థాన్ లీవర్ రూ.330 కోట్లతో పామాయిల్ ఇండస్ట్రీని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. దీంతోపాటు బ్యూటీ పోర్టు ఫోలియేకు సంబంధించి టెక్నాలజీ సెంటర్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్, బ్యూటీ, హోంకేర్ ఉత్పత్తుల తయారీకి రాష్ట్రం అనుకూలంగా ఉంటుందని వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు రావాల్సిందిగా ఉజ్జెన్‌ను ఆహ్వానించారు.

### సెన్మట్ సీఈవోతోనూ...

ప్రపంచ ఆర్థిక సదస్సు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు, సెంటర్ ఫర్ ఎనర్జీ అండ్ మెటీరియల్స్(సెన్మట్) హెడ్ రాబర్టో బోకాను సీఎం చంద్రబాబుతో సమావేశమయ్యారు. గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజీ, సోలార్ ప్యానల్స్ ఉత్పత్తి రంగాల్లో ఏపీకి అంతర్జాతీయ పెట్టుబడులు తరలివచ్చేలా సెన్మట్ సహకారం అందించాలని కోరారు. క్లీన్ ఎనర్జీ నాలెడ్జ్–స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌కు డబ్ల్యూఈఎఫ్ మద్దతు ఇవ్వాలని కోరారు.

### సీఆర్డీయే పరిధిలో అంతర్జాతీయ విమానాశ్రయం పెట్టండి

**3 నుంచి 5 వేల ఎకరాలు సమకూరుస్తాం.. ఎయిరిండియా ఎండీ, సీఈవోతో లోకేశ్**

'ఏపీ రాజధాని అమరావతి శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని సీఆర్డీయే పరిధిలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పెట్టండి. దుబాయ్ విమానాశ్రయాన్ని తలదన్నేలా ఉండాలి. మీకు 3 వేల నుంచి 5 వేల ఎకరాలను సమకూరుస్తాం' అని రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్ ఎయిరిండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో క్యాంప్ బెల్ విల్సన్‌ను కోరారు. దావోసలో ఆయన విల్సన్‌తో భేటీ అయ్యారు. విశాఖ విమానాశ్రయంలో ప్రాంతీయ మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాల్ హబ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సీఆర్డీయే పరిధిలో దుబాయ్ తరహా విమానాశ్రయాన్ని ఏర్పాటు చేస్తే ఏపీకి అంతర్జాతీయ పెట్టుబడులు వస్తాయన్నారు. పైలెట్లు, విమానయాన సాంకేతిక సిబ్బంది కోసం శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. విల్సన్ స్పందిస్తూ.. విశాఖలో ఎంఆర్‌వో హబ్ ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలిస్తామని, సీఆర్డీయే పరిధిలో విమానాశ్రయం సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తామన్నారు.

### విశాఖలో డిజైన్ కేంద్రం పెట్టండి

ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు,సాంకేతికంగా తమ రాష్ట్రాన్ని బలోపేతం చేసేందుకు ముందుకు రావాలంటూ దావోస్ వేదికగా ప్రతిష్ఠాత్మక కంపెనీలను సీఎం చంద్రబాబు కోరారు. సర్వర్ల కోసం సొంత చిప్‌లను రూపొందిస్తున్న గూగుల్ క్లౌడ్ సంస్థ తన డిజైన్ కేంద్రాన్ని ఏపీలో ఏర్పాటుచేసే విషయం యోచించాలని ఆ సంస్థ సీఈవో థామస్ కురియన్‌కు సూచించారు. క్లౌడ్ ప్రొవైడర్‌లో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద సంస్థ ఇది. ఢిల్లీ, ముంబైల్లో 2కేంద్రాలను ఇప్పటికే నెలకొల్పింది. విశాఖలో డేటాసిటీ ఏర్పాటుకుబీ ఏఐ వినియోగాన్ని అభివృద్ధి చేయడానికి, రాష యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను పెంచడానికి ప్రభుత్వంతో గూగుల్ ఇప్పటికే పలు ఒప్పందాలు చేసుకుంది. ఈ క్రమంలోనే సీఈవో కురియన్‌తో చంద్రబాబు చర్చలు జరిపారు. రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన యువత అందుబాటులో ఉందని ఆయనకు చంద్రబాబు చెప్పారు. డిజైన్ కేంద్రానికి విశాఖ అత్యంత సానుకూలమైనదని చెప్పారు.

### పెట్రోనాసకు మూలపేట అనుకూలం

మలేసియాకు చెందిన ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీ పెట్రోనాస్ సీఈవో , ప్రెసిడెంట్ మహహ్మద్ తౌఫిక్‌తో చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పెట్రోనాస్ కంపెనీ నేచురల్ గ్యాస్, గ్రీన్ మాలిక్యూలస్ ఉత్పత్తులకు ప్రసిద్ధి చెందింది. సముద్రతీర ప్రాంతం అత్యధికంగా కలిగిన ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోనాస్ అనుబంధ సంస్థను ఏర్పాటు చేయాలని తౌఫిక్‌ను చంద్రబాబు కోరారు. ఇందుకు కొత్తగా ఓడరేవును నిర్మిస్తున్న మూలపేట అనువుగా ఉంటుందని సూచించారు. 2030 నాటికల్లా ఏడాదికి ఐదు మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేయాలని పెట్రోనాస్ లక్ష్యంగా పెట్టుకుంది. కాకినాడ ప్లాంటులో రూ.13వేల కోట్ల నుంచి రూ.15వేల కోట్ల పెట్టుబడి పెడుతుంది. పెట్రోకెమికల్ హబ్‌గా అవతరిస్తున్న మూలపేటలోను, గ్లోబల్ ఫెసిలిటీ సెంటరులోను పెట్టుబడులు పెట్టాలని తౌఫిక్‌ను చంద్రబాబు కోరారు.

### స్మార్ట్ కంటైనర్ టెర్మినల్ నిర్మించండి

రాష్ట్రంలో స్మార్ట్ కంటైనర్ టెర్మినల్‌ను నిర్మించాలని దిగ్గజ కంపెనీ డీపీ వరల్డ్‌ను సీఎం చంద్రబాబు కోరారు. దావోస్ సదస్సులో ఆ సంస్థ సెంట్రల్ ఆసియా, ఆఫ్రికా మేనేజింగ్ డైరెక్టర్ రిజ్వాన్ సూమూర్‌తో ఆయన చర్చలు జరిపారు. భారతదేశంలో డీపీ వరల్డ్‌కు ఐదు కంటైనర్ టెర్మినల్స్ ఉన్నప్పటికీ, ఏపీలో ఇప్పటిదాకా ఒక్క కంటైనర్ కూడా లేదని చంద్రబాబు గుర్తు చేశారు. కాకినాడ, మూలపేట, కృష్ణపట్నంలో స్మార్ట్ కంటైనర్‌ను ఏర్పాటు చేసేందుకు అవకాశాలు ఉన్నాయని సూమూర్‌కు సూచించారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న సీపోర్టులోను, ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్‌లోను పెట్టుబడులు పెట్టాలని కోరారు. డీపీ వరల్డ్ ప్రపంచవ్యాప్తంగా 82 మెరైన్, ఇన్‌ల్యాండ్ టెర్మినళ్లను నిర్వహిస్తోంది. గ్లోబల్ కంటైనర్ వ్యాపారంలో దాదాపు పది శాతం మార్కెట్ డీపీ వరల్డ్ సొంతం. రాష్ట్రానికి ఈ సంస్థ వస్తే అంతర్జాతీయ వాణిజ్యానికి దోహదపడుతుందని ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి.

### డిజిటల్ హబ్ ఏర్పాటు చేయండి

పెప్సికో ఇంటర్నేషనల్ బేవరేజస్ సీఈవో యూజీన్ విల్లెంసెన్, పెప్సికో ఫౌండేషన్ చైర్మన్ స్టీవెన్ కెహోతోలతో చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రపంచంలోనే రెండో పెద్ద బేవరేజస్ సంస్థ పెప్సికో ఇప్పటికే శ్రీసిటీలో బాట్లింగ్ ప్లాంట్ నిర్వహిస్తోంది. విశాఖపట్నాన్ని గ్లోబల్ డెలివరీ సెంటర్‌గా చేసుకుని అక్కడ పెప్సికో డిజిటల్ హబ్‌ను ఏర్పాటు చేయవచ్చని చంద్రబాబు సూచించారు. గ్లోబల్ బిజినెస్ సర్వీస్ సెంటర్‌ను విశాఖకు విస్తరించాలని కోరారు. కుర్కురే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌తోపాటు, సప్లై చైన్ ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ఏపీసీఎన్ఎఫతో భాగస్వామి కావాలని సూచించారు. బహ్రెయిన్ ప్రధాని కార్యాలయ ప్రతినిధి హమద్ అల్ మహ్మద్ ముంరాలకత్, సీఈవో అబ్దుల్లా బిన్ ఖలీఫాతోనూ చర్చలు జరిపారు. పారిశ్రామిక పాలసీలను వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కోసం ఏపీకి రావాలని ఆహ్వానించారు.



## దావోస్‌లో రికార్డుస్థాయి పెట్టుబడులు

కుదుర్చుకుంది. 400 మెగా వాట్ల సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ నెలకొల్పుతామని ప్రకటించింది. ఈ ప్రాజెక్ట్‌తో దాదాపు 3,600 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఈ డేటా సెంటర్ ఏర్పాటు మరో మైలురాయి గా నిలుస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఈ ఒప్పందంతో ఐటీ సేవల సామర్థ్యం పెరుగుతుంద ని, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని పేర్కొన్నారు. డేటా సెంటర్ల ఏర్పాటుతో తెలంగాణలో ఐటీ సేవల ప్రమాణాలు మరింత వృద్ధి సాధిస్తాయని కంట్రోల్ ఎస్ సీఈవో శ్రీధర్ పిన్నపురెడ్డి అన్నారు. అమెరికా కేంద్రంగా రక్షణ రంగంలో వివిధ ఉత్పత్తులు తయారుచేసే ప్రముఖ కంపెనీ జేఎసడబ్ల్యూ.. రాష్ట్రంలో రూ. 800 కోట్ల పెట్టుబడులు పెడతామని.. అధునాతన అన్‌మాన్డ్ ఏరియల్ సిస్టమ్స్ (యూఏవీ) తయారీ యూనిట్ ఏర్పాటుచేస్తామని ప్రకటించింది. అలాగే చెన్నైలో ప్రారంభమై ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన దిగ్గజ ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్.. హైదరాబాద్‌లో కొత్త టెక్ సెంటర్‌ను ప్రారంభించనుంది. హెచ్‌సీఎల్ టెక్ గ్లోబల్ సీఈవో, ఎండీ సి.విజయకుమార్‌తో సీఎం రేవంత్ చర్చల అనంతరం కంపెనీ ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ ఒప్పందంలో భాగంగా అత్యాధునిక క్లౌడ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సొల్యూషన్‌లకు సంబంధించి కొత్త సెంటర్ ఏర్పాటు చేయనుంది. హైటెక్ సిటీలో 3.2 లక్షల చదరపుటడుగుల విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటుచేస్తామని, దీంతో దాదాపు 5వేల మంది ఐటీనిపుణులకు ఉద్యోగాలు లభిస్తాయని కంపెనీ తెలిపింది. కాగా.. ప్రపంచస్థాయి వసతులతో కొత్త కేంద్రాన్ని ఏర్పాటుచేస్తామని సీఈవో విజయ్ కుమార్ తెలిపారు. తాజా నిర్ణయంతో నగరంలో హెచ్‌సీఎల్ కేంద్రాల సంఖ్య ఐదుకు పెరగనుంది.

### తెలంగాణలో డ్రైపోర్ట్

తెలంగాణలో డ్రై పోర్టును నిర్మించి వేర్‌హౌజ్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని.. రాష్ట్రానికి తీరప్రాంతం లేని లోటును పూడ్చడానికి ఈ డ్రై పో ర్టును మచిలీపట్నం పోర్టుకు రోడ్డు, రైల్వే మార్గాలతో అనుసంధానం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దావోసలో ప్రపంచ ఆర్థిక వేదిక, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ, హీరో మోటార్ కార్ప్ సంయుక్తంగా బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ భేటీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. "తెలంగాణ అంటేనే బిజినెస్.. భారీ వ్యాపార అవకాశాలున్న రంగాల్లో పెట్టుబడులతో రండి.. పారిశ్రామికవేత్తలకు తెలంగాణ ప్రభు త్వం రెడ్ కార్పెట్ స్వాగతం పలుకుతుంది" అని రేవంత్ పేర్కొన్నారు. ప్రపంచస్థాయి అత్యున్నత ప్రమాణాలతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ లక్ష్యసాధనకుసహకరించాలని పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. ప్రపంచంలోనే అత్యుత్తమ మొబిలిటీ అవకాశా లు హైదరాబాద్‌లో ఉండాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. విద్యుత్తు వాహనాలపై తాము ప్రత్యేకంగా దృష్టి సారించామని.. ఆ వాహనాలపై రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలు రద్దు చేశామని వివరించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రజారవాణా వ్యవస్థలో 3 వేల విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. అనంతరం నిర్వహించిన మరో సమావేశంలో.. ట్రిలియన్ మొక్కలు నాటడమే లక్ష్యంగా ఏర్పడిన 'ట్రిలియన్ ట్రీ ఉద్యమానికి సీఎం మద్దతు తెలిపారు. ఇందులో భాగస్వామిని అవుతానంటూ ప్రమాణం చేశారు. ప్రపంచంలోనే అత్యుత్తమ మొబిలిటీ అవకాశా లు హైదరాబాద్‌లో ఉండాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. విద్యుత్తు వాహనాలపై తాము ప్రత్యేకంగా దృష్టి సారించామని.. ఆ వాహనాలపై రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలు రద్దు చేశామని వివరించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రజారవాణా వ్యవస్థలో 3 వేల విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. అనంతరం నిర్వహించిన మరో సమావేశంలో.. ట్రిలియన్ మొక్కలు నాటడమే లక్ష్యంగా ఏర్పడిన 'ట్రిలియన్ ట్రీ ఉద్యమానికి సీఎం మద్దతు తెలిపారు. ఇందులో భాగస్వామిని అవుతానంటూ ప్రమాణం చేశారు.

## పంచాయతీ ప్రక్షాళన

**ఒకే గొడుగు కిందకు వ్యవస్థలు.. జిల్లాల్లో ఒకే చోట కార్యాలయాలు**

**సంస్కరణలకు సంఘాలు ఓకే.. ఏకగ్రీవ ఆమోదం**

అమరావతి, జనవరి 22: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖను ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఆ శాఖను సమూల సంస్కరణల దిశగా నడిపించేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రంగంలోకి దిగారు. స్థానిక సంస్థల పాలన ప్రజలకు చేరువ కావడంతోపాటు పారదర్శకతకు, జవాబుదారీతనానికి పెద్దపీట వేయనున్నారు. ఈ శాఖకు సంబంధించిన వ్యవస్థలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురానున్నారు. నిపుణులతో సంప్రదించిన ఉపముఖ్యమంత్రి 'ఎవరికి వారే' అన్నచందంగా ఉన్న పంచాయతీరాజ్ సంస్థలన్నింటినీ ఒకే చోటకు చేర్చే ప్రయత్నాలు ప్రారంభించారు. బుధవారం ఈ శాఖలో భాగస్వాములుగా ఉన్న డీఎల్‌డీవో, ఎంపీడీవో, డీపీవో, డిప్యూటీ సీఈవో, డీఎల్‌పీవో, ఈవో పీఆర్‌డీల ఉద్యోగ సంఘాలు, పంచాయతీరాజ్ అసోషియేషన్ జేఏసీ నేతలతో తాడేపల్లి కార్యాలయంలో కమిషనర్ కృష్ణతేజ, ఉపముఖ్యమంత్రి ఓఎసడీ వెంకటకృష్ణ భేటీ అయ్యారు. ప్రభుత్వం ప్రతిపాదించిన సంస్కరణలను అధికారులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సంస్కరణలను కమిషనర్ కృష్ణతేజ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

### సమూల మార్పులు

రాష్ట్రంలోని అన్ని శాఖల కంటే పంచాయతీరాజ్ శాఖ చాలా పెద్దది. లక్షమందికి పైగా ఉద్యోగులున్న ఈ శాఖలో పాలన ఒక తాటి మీద లేకపోవడంతో గ్రామీణాభివృద్ధి సజావుగా సాగనిపరిస్థితి నెలకొంది. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాలు, ఉన్నతాధికారులు ఈ శాఖను సంస్కరించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థలన్నీ ఒకేచోట ఉండాలని పవన్ కల్యాణ్.. నిర్ణయించారు. ఈ క్రమంలోనే సంస్కరణలకు ప్రాధాన్యం ఇచ్చారు. జిల్లాస్థాయిలో సచివాలయాలను పర్యవేక్షిస్తున్న డీఎల్‌డీవోలకు కార్యాలయాలు లేవు. డీపీవోలకు కూడా భవనాలు లేవు. జడ్పీలు, ఇంజనీరింగ్ విభాగాలకు మాత్రమే కార్యాలయాలున్నాయి. దీంతో జిల్లా స్థాయిలో ఆయా విభాగాలను పర్యవేక్షించేందుకు కలెక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో జడ్పీ సీఈవో, డీఎల్‌డీవో, డీపీవో, పీఆర్ ఇంజనీరింగ్, ఎస్ఈ కార్యాలయాలన్నింటినీ ఒకే కాంపౌండ్‌లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

### కేడర్ పోస్టులకు ఒకే హోదా

పంచాయతీరాజ్ విభాగంలో డివిజనల్ డెవల్‌పమెంట్ ఆఫీసర్(డీఎల్‌డీవో)ను ఇక నుంచి డీడీవోగా పిలవనున్నారు. అదే విధంగా డీడీవోలు, డిప్యూటీ సీఈవోలు, డీపీవోలను ఒకే కేడర్ కిందకు చేర్చారు. వారు పదోన్నతి పొంది జడ్పీ సీఈవోలు అవుతారు. ఎంపీడీవోలు, డీఎల్‌పీవోలను ఇకనుంచి ఒకే కేడర్ కింద పరిగణిస్తారు. వారికి పదోన్నతి లభిస్తే డీఎల్‌డీవోలు, డిప్యూటీ సీఈవోలు, డీపీవోలు అవుతారు. మండలస్థాయిలో ఈవో పీఆర్ అండ్ ఆర్డీ అధికారులను ఇకనుంచి మండల పంచాయతీ అధికారులుగా పిలుస్తారు. అయితే, ఎంపీడీవోలను దేశవ్యాప్తంగా బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు(బీడీవో)లుగా పిలుస్తున్నందున రాష్ట్రంలోనూ అలాగే పరిగణించాలని సంఘాలు కోరాయి. పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. తాజా సంస్కరణల్లో భాగంగా ఎంపీడీవో పోస్టులు పదోన్నతుల ద్వారానే భర్తీ చేయాలని నిర్ణయించారు. ఇకనుంచి వారిని నేరుగా నియమిం చే విధానానికి స్వస్తి పలకనున్నారు. ఎంపీడీవో స్థాయి కంటే కింద ఈవో పీఆర్ అండ్ ఆర్డీ, సూపరింటెండెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు వేలమంది ఉన్నందున వారికి పదోన్నతులు దక్కేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. డీఎల్‌డీవో పోస్టులను సర్వీసు కమిషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. అదేసమయంలో పదోన్నతుల ద్వారా కూడా భర్తీ చేస్తారు. రెవెన్యూ విభాగంలో ఆర్డీవోకు ఏ స్థాయి అధికారాలు ఉంటాయో, పంచాయతీరాజ్‌లో డీఎల్‌డీవోలకు అవే అధికారాలు కల్పిస్తారు. మొత్తంగా అధికారాల్లో ఎలాంటి మార్పులు చేయరు.

### మంచి పరిణామం: సంఘాలు

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ శాఖలో సంస్కరణలు తీసుకురావడం సంతోషంగా ఉందని పంచాయతీరాజ్ జేఏసీ నేత కేఎస్ వరప్రసాద్ తెలిపారు. అధికారులు, ఉద్యోగులు కోరుకుంటున్నట్టుగా సంస్కరణలు ప్రారంభమయ్యాయన్నారు.



## ఒక రైలు దిగి.. మరో రైలు కింద నలిగి.. 12 మంది దుర్మరణం

వచ్చి, పొగ రేగింది. దీంతో.. ఓ ప్రయాణికుడు "బోగీకి నిప్పంటుకుంది" అంటూ అరిచాడు. అది విని కంగారు పడ్డ ప్రయాణికులు చైన్ లాగారు. రైలు ఆగడంతో సుమారు 50 మంది ప్రయాణికులు రైలులోంచి కిందకు దిగారు. పుష్పక్ ఎక్స్‌ప్రెస్ సరిగ్గా ఓ భారీ కల్వర్టు వద్ద ఆగడంతో.. ఒకవైపు సేఫ్టీవాల్, లోయను తలపించే కాలువ.. మరోవైపు రెండో ట్రాక్ ఉన్నాయి. దీంతో.. ప్రయాణికులు ట్రాక్ ఉన్న వైపు దిగి.. నిప్పురవ్వలు వచ్చిన ప్రాంతాన్ని పర్యవేక్షిస్తూ.. అక్కడే నిలబడ్డారు. అంతలో మృత్యుశకటంగా కర్ణాటక ఎక్స్‌ప్రెస్ వారు నిలబడ్డ ట్రాక్ వైపు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో దూసుకువచ్చింది. ప్రయాణికులు తేరుకుని, పక్కకు తప్పుకొనేలోపే.. ట్రాక్‌పై ఉన్నవారిని ఢీకొంటూ.. వారిని కొంత దూరం ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనలో 12 మంది అక్కడికక్కడే మృతిచెందారు. మృతుల్లో పదేళ్ల వయసున్న ఓ బాలుడితోపాటు.. ముగ్గురు మహిళలున్నారు. మరో 10 మందికి గాయాలయ్యాయి. మిగతావారు జరిగిన దారుణాన్ని అర్థం చేసుకునేలోపు.. మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. పలు మృతదేహాల చేతులు, కాళ్లు తెగి.. రక్తపు ముద్దలు ట్రాక్‌పై దర్శనమిస్తూ.. బీభత్సమైన దృశ్యాలు కనిపించాయి. పోలీసులు కూడా తొలుత 11 మంది మృతిచెందారని భావించారు. అయితే.. ఆస్పత్రిలో శరీర భాగాలను మృతదేహాల వారీగా జతచేయగా.. 12 మంది చనిపోయినట్లు తేలిందని ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి వివరించారు. క్షతగాత్రులను పచోరాలోని బృందావన్ ఆస్పత్రికి తరలించారు. వారికి మెరుగైన చికిత్స అందించాలని మహారాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. సంఘటనాస్థలిని జల్గావ్ ఎంపీ స్మితావాఘ్, మాజీ ఎంపీ ఉన్మేశ్‌పాటిల్, జిల్లా కలెక్టర్ ఆయుష్ ప్రసాద్, ఐజీ దత్తాత్రేయ కరాలే సందర్శించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. అగ్నిప్రమాదమేమీ జరగలేదని, కేవలం వదంతులతోనే దారుణం జరిగిందన్నారు. మృతులంతా జనరల్ కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణిస్తున్నవారేనని వివరించారు. ఈ ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ఘటన సమాచారం అందగానే ఎనిమిది అంబులెన్స్‌లను పంపించాం. మంత్రి గిరీశ్ మహాజన్, ఇతర అధికారులు సంఘటనాస్థలికి చేరుకున్నారు. క్షతగాత్రులకు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో మెరుగైన చికిత్స అందిస్తున్నాం" అని ఎక్స్‌లో పోస్టు చేశారు. మహారాష్ట్ర సర్కారు తరఫున మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందిస్తామన్నారు.

## ఢిల్లీలో ఆప్ ఓటమి ఖాయం: మోదీ



న్యూఢిల్లీ, జనవరి 22: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి ఓటమి తప్పదని ప్రధాని మోదీ చెప్పారు. అందుకే ఆపద (ఆప్) పార్టీ నేతలు పూటకో కొత్త హామీ ఇస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఢిల్లీ బీజేపీ కార్యకర్తలతో మోదీ ఆన్‌లైన్ ద్వారా సంభాషించారు. 50శాతానికిపైగా ఓట్లు పడేలా బీజేపీ నేతలు, బూత్ కార్యకర్తలు లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని ఆయన సూచించారు. నిత్యావసరాలు, కనీస అవసరాలు అందక ఢిల్లీ ప్రజలు కష్టాలు పడుతుంటే కేజ్రీవాల్ శీశ్‌మహల్ వంటి భవనం కట్టుకున్నారని మోదీ ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఢిల్లీని అభివృద్ధి చెందిన రాజధాని నగరంగా తీర్చిదిద్దుతామని ప్రధాని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా.. ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌లపై చెరి రూ.50 కోట్ల మేర పరువు నష్టం దావా వేయబోతున్నట్లు బీజేపీ ఎంపీ పర్వేశ్ వర్మ ప్రకటించారు. పంజాబీలు దేశానికి ప్రమాదకరంగా మారారని తాను అన్నట్లుగా దుష్ప్రచారం చేస్తున్నందుకే ఈ దావా వేస్తున్నట్లు తెలిపారు.

## జవహర్ జాన్‌పహాడ్ ఎత్తిపోతలకు అదనంగా రూ.100కోట్లు



సామర్థ్యం పెరగడంతోపాటు ఆయకట్టు మరో వేల ఎకరాలు పెరగనుందన్నారు. ఈ నీటితో జాన్‌పహాడ్ మునిమోపుల చెరువును నింపేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా బెట్టెతండాలో మూసీ నదిపై చెక్‌డ్యాంకు రూ.7.5 కోట్లు మంజూరు చేశారు. జాన్‌పహాడ్ గ్రామం నుంచి జవహర్ జాన్‌పహాడ్ లిఫ్ట్ పంపుహౌస్ వరకు మెటల్ రోడ్డు నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేశారు. ఈ పనులన్నీ వచ్చే పంటల సాగు వరకు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నిర్ణయాలపై మాజీ జడ్పీటీసీ మోతీలాల్, మాజీ ఎంపీపీ గోపాల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బారావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సప్పిడి నాగిరెడ్డి, తీగల వెంకట్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.





## శ్రీరాంపురం తండా లో జరిగిన సైడ్ కాలువల్లో పూడికతీత స్వయంగా పర్యవేక్షించిన ఎస్టీ సెల్ అధ్యక్షులు దేశావత్ మల్లయ్య నాయక్

జన సముద్రం న్యూస్,జనవరి 22, వెల్దుర్తి.

పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలంలోని శ్రీరాంపురంతండా గ్రామంలో గల సైడ్ కాలువల్లో ఉన్న మట్టిని ఎస్టీ సెల్ అధ్యక్షులు దేశావత్ మల్లయ్య నాయక్ దగ్గరుండి స్వయంగా తీయించటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తీయించి శుభ్రం చేయటం జరిగిందన్నారు. తద్వారా మురికి నీరు నిల్వ ఉండటానికి వీలు లేదని, దోమలు , ఈగలు రాకుండా ఉంటాయని, డెంగ్యూ, మలేరియా లాంటి రోగాలు రాకుండా ఉండాలంటే సైడ్ కాలువలు శుభ్రం చేసుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కూడా పాల్గొని సైడ్ కాలువలు శుభ్రం చేయుటలో సహాయపడ్డారని మల్లయ్య నాయక్ తెలిపారు.



## హెల్మెట్ లేకపోతే ఫైన్

రామాపురం జనవరి, 22 జనసముద్రం

ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి రామాపురం సబ్ ఇన్స్పెక్టర్ వెంకట సుధాకర్ రెడ్డి సూచించారు అలా లేని పక్షంలో తప్పక ఫైన్ చెల్లించాలని చెప్పారు నేడు మధ్యాహ్నం కడప ప్రధాన రహదారిలో పోలీస్ స్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ లేకుండా ప్రయాణాలు చేసే వారికి తగిన సూచనలు సలహాలు అందించారు. హెల్మెట్ లేకుంటే వాహనాలు నడుపుతున్న వారికి ఫైన్ వేశారు హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం వల్ల ప్రయాణానికి డ్రైవింగ్ చేసేవారికి ఎంతో సురక్షితంగా ఉంటుంది పోలీసులు తెలిపారు . హెల్మెట్ ధరించాలి అన్న అవగాహన ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా యవజన క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సహకారంతో రాయచోటి సహకార గృహ సంఘం (ఎస్ ఎన్ కాలనీ ప్రెసిడెంట్) అధ్యక్షులుగా మండిపల్లి రాహుల్ కుమార్ రెడ్డి

### ఏకగ్రీవంగా ఎన్నికైన మండిపల్లి రాహుల్ రెడ్డి

### మంత్రి రాంప్రసాద్ రెడ్డి సారధ్యంలో కాలనీ అభివృద్ధికీ కృషి.. రాహుల్ రెడ్డి





రాయచోటి జనవరి,22 జనసముద్రం

రాయచోటి సహకార గృహ నిర్మాణ సంఘం నిర్వహించిన ఎన్నికలలో 6 గురు మెంబర్లు బలపరచడంతో అధ్యక్షుడిగా ఏకగ్రీవమైన మంత్రి సోదరుడు మండిపల్లి రాహుల్ కుమార్ రెడ్డి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సహకారంతో కాలనీలోని అందరికీ అందుబాటులో ఉంటూ మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన లిరాహుల్ రెడ్డి




## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు

లక్కిరెడ్డిపల్లె జనసముద్రం న్యూస్ జనవరి 22

లక్కిరెడ్డిపల్లి మండలంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేయడమైనది నూరు శాతం ప్రకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయలు మాత్రమే ఇక్కడ అమ్మడం జరుగుతుంది ఈ కూరగాయలు తినడం వల్ల మన ఆరోగ్యం అలాగే బీపీ షుగర్ ఎటువంటి రోగాలు రాకుండా మనము కాపాడుకోవచ్చు,ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఏర్పాటు చేయడం జరిగింది ఈ స్టాల్లో కూరగాయలు ఆకుకూరలు, దుంప జాతులు తీగజాతి కూరగాయలు అన్నీ కూడాఉంటాయి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది లక్కిరెడ్డిపల్లి మండలంలో పనిచేసే క్యాడర్స్ మరియు రైతుల పొలాలలో నూరుశాతం తన పొలంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నది ఆమె పొలంలో పండించిన కూరగాయలే కాకుండా ఈ గ్రామానికి సంబంధించిన రైతులు గాని ఇక్కడ పనిచేసే క్యాడర్స్ గాని వాళ్ళ పొలాల్లో పండే కూరగాయలన్నీ కూడా సేకరించి ఇక్కడ స్టాల్ గా ఏర్పాటు చేయడం జరిగింది,మండలానికి సంబంధించిన ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ వెంకటరమణ మోడల్ మేకర్ సరస్వతి మండల యూనిట్ ఇన్చార్జిలు గంగిరెడ్డి,చంద్రమోహన్ రెడ్డి,లక్ష్మీదేవి, నాగమణి, ఐసిఆర్పిలు రైతులు హాజరు కావడం జరిగింది

# మోటూరు గురుకుల పాఠశాలను ....ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము





జనసముద్రం న్యూస్ గుడివాడ ప్రతినిధి. జనవరి. 22.

మోటూరు గురుకుల పాఠశాలను ....ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాములితరగతుల వారిగా విద్యార్థినీలతో మాట్లాడిన ఎమ్మెల్యే..... సదుపాయాలపై ఆరామంత్రి లోకేష్ ఆలోచనలతో విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు...బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలంటూ, విద్యార్థినీలకు ఆశీస్సులు అందించిన ఎమ్మెల్యే రాము....గుడివాడ రూరల్ మండలం మోటూరులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము బుధవారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా గురుకుల పాఠశాల పరిసరాలను పరిశీలించిన ఎమ్మెల్యే రాము.... తరగతుల వారీగా తిరుగుతూ విద్యార్థినిలతో నేరుగా మాట్లాడారు... వసతి గృహంలో మెనూ....ఇతర వసతులపై ఎమ్మెల్యే రాము ఆరా తీశారు. డిజిటల్ బోర్డుల ద్వారా అధ్యాపకులు అందిస్తున్న బోధనలను విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే ఆసక్తిగా విన్నారు. ప్రతి తరగతి గదికి ఉత్సాహంగా తిరిగిన ఎమ్మెల్యే రాము విద్యార్థినిలతో కొద్దిసేపు ముచ్చటించారు. బాగా చదువుకోనీ ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థినిలకు ఎమ్మెల్యే ఆశీస్సులు అందించారు.అనంతరం గురుకులం వసతిగృహాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే... అక్కడి పరిస్థితులపై అసంతృప్తి వ్యక్తం చేసి.... పరిస్థితులను చక్కదిద్దాలంటూ ప్రిన్సిపాల్ సంజీవిని దేవినీ సున్నితంగా హెచ్చరించారు. హెల్త్ సూపర్వైజర్ తో మాట్లాడుతూ విద్యార్థినిల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సమస్యలు తలెత్తితే సమీపంలోని మండల పిహెచ్సి వైద్యుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.తనిఖీలలో భాగంగా విద్యార్థినీలకు అందించే మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించిన ఎమ్మెల్యే రాము... ఆహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీలలో భాగంగా గుర్తించిన పలు అంశాలను... చక్క దిద్దుకోవాలంటూ ప్రిన్సిపల్ కు ఎమ్మెల్యే రాముపల్లి సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలోనీ విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయన్నారు. విద్యా వ్యవస్థ అభివృద్ధికి మంత్రి లోకేష్ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగానే వసతి గృహాల్లో విద్యార్థులకు సదుపాయాలు అందేలా అధికారులు దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే రాము సూచించారు. నియోజకవర్గంలోని వసతి గృహాల్లో సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని.... సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే రాము పునరుద్ఘాటించారు.ఈ తనిఖీలలో మండల ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, మోటూరి పంచాయతీ కార్యదర్శి పి.జనార్ధన్, టిడిపి నాయకులు చేకూరు జగన్ మోహన్ రావు, మోటూరు శేషగిరి, కటారి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ ఏలూరు, శ్రీలత మేడం, డిస్ట్రిక్ట్ ప్రోహినబిషన్ ఎక్సైజ్ ఆఫీసర్ డీపీ , ఏలూరు జిల్లా, ఏ .ఆవులయ్య వారి ఆదేశాలు ప్రకారం





ఏలూరు జిల్లా చింతలపూడి జనవరి 22 జన సముద్రం,

చింతలపూడి ప్రొహిబిషన్ %ఢ% ఎక్సైజ్ స్టేషన్ పరిది లో గల టి.నరసాపురం మండలం తిరుమలదేవిపేట గ్రామం లో నాటు సారాయి స్థావరాలు పై దాడులు నిర్వహించగా మాధ్యాన్నపువారిగూడెం గ్రామమునకు చెందిన కటారి కృష్ణ అను వ్యక్తి నాటు సారాయి తయారికి కావలసిన ముడు సరుకు (20) కేజిలు బెల్లం, (1) కేజి అమోనియా, (250) గ్రాములు పట్టిక మరియు (200) లీటర్లు పరిమాణం గల ప్లాస్టిక్ డ్రమ్ము లో పులిసిన బెల్లపు ఊట కలిగి ఉండుట తో పట్టుబడగా అతనిని అదుపులో తీసుకొని నేరపు సొత్తును స్వాధీన పరుచుకొని, ఆ వ్యక్తి పై కేసు నమోదు చేయడమైనది!అలాగే టి.నరసాపురం మండలం తిరుమలాదేవిపేట, మద్యాన్నపువారిగూడెం మరియు కన్నప్పగూడెం గ్రామంలో పాత నాటు సారాయి కేసులో నిందితురాలు అయిన కటారి కృష్ణ, కటారి నాగలక్ష్మి , పాయం వెంకటేశ్వరావు , అను ముగ్గరును మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ టి.నరసాపురం వారి ఎదుట 129 బన్స్ చట్టం ప్రకారం హాజరు పరచి బైండ్ ఓవర్ నమోదు చేయడమైనది!ఈ దాడులలో స్థానిక చింతలపూడి ఎక్సైజ్ ఎస్.ఐ.లు ఆర్.వి.ఎల్.నరసింహా రావు, అబ్దుల్ ఖలీల్ మరియు సిబ్బంది పాల్గొన్నారు అని ఎక్సైజ్ సి.ఐ. పి.అశోక్ తెలిపినారు!

## నేడే మంత్రి నారా లోకేష్ జన్మదిన సందర్భంగా లక్కిరెడ్డిపల్లి టిడిపి కార్యాలయం లో ఘనంగా జన్మదిన వేడుకలు

### మంత్రి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి హాజరవుతారు

### మండల నాయకుడు యనమల మదన్మోహన్



లక్కిరెడ్డిపల్లి జన సముద్రం న్యూస్ జనవరి 22

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు జన్మదిన సందర్భంగా 23-01-2025 గురువారం నాడు సాయంత్రం 4 గంటలకి లక్కిరెడ్డి పల్లి స్థానిక టిడిపి కార్యాలయంలో ఘనంగా జన్మదిన వేడుకలు జరుగునున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లిరాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రామప్రసాద్ రెడ్డి సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి హాజరవుతున్నారని మండల యువ నాయకుడు యనుముల మదనమోహన్ తెలి పారు. కావున ఈ కార్యక్రమానికి లక్కీరెడ్డిపల్లి తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండిపల అభిమానులు పాల్గొని జన్మదిన వేడుకలను భారీ ఎత్తున విజయవంతం చేయాలని తెలియజేశాడు

## నారా లోకేష్ జన్మదిన వేడుకల్లో పాల్గొననున్న ఎమ్మెల్యే జూలకంటి



జనసముద్రం న్యూస్, జనవరి 22.పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం లోని పలుచోట్లలో ఈనెల 23వ తేదీన జరిగే ఐటి మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమాల్లో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు తెలియజేశారు.



## సొరకాయల పేట గ్రామంలో పశు ఆరోగ్య శిబిరాలు కార్యక్రమం

జనసముద్రం న్యూస్ జనవరి 22 ( పామిడి రూరల్ )

పామిడి మండలంలో సొరకాయల పేట గ్రామంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పశు సంవర్ధక సిబ్బంది వెటర్నరీ డాక్టర్, సాయి సుప్రజ, గోపాల్ మిత్ర, నరేంద్ర,గోపాలరెడ్డి, అశ్వత్ నారాయణ, సచివాలయం సిబంది, పాల్గొనడం జరిగింది. పశువులకు, దూడలకు, గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు (తాపించడం జం వలన పశువుల పొట్టని ఏలిక పాములు, జలగలు నశించి పశువులకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి అన్ని పశువులు ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే జబ్బు చేసిన గర్భకోశ సంబంధమైన సమస్యలు ఉన్న పశువులకు చికిత్స చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వీరారెడ్డి, సాదం రామాంజనేయులు, ఖాదర్ భాయ్, రాజేష్ సురేష్ గాండ్ల సుబ్బరాయుడు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## రాతిదూలం పోటీలలో ఎద్దులజతను ప్రారంభించిన పామిడి వీరా

జనసముద్రం న్యూస్ జనవరి 22 ( పామిడి )పామిడి పట్టణంలోని కొండూరు రోడ్డులో వెలిసిన అంకాళమ్మ కుంటేమ్మ అమ్మవార్ల జాతర సందర్భంగా ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరా జాతరలో పాల్గొని అమ్మవారి ని దర్శించుకొని అనంతరం 5వ ఎద్దుల జతను ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధ తట్టుకోలేక మృతి



ఏలూరు జిల్లా చింతలపూడి జనవరి 22,

ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం తెలుగుదేశం పార్టీ, కార్యకర్త కొనకళ్ళ శ్రీనివాసరావు (ఆము ) గౌడ్ అప్పుల బాధలతో మనస్థాపన కుగురై మరణించారు .. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుచున్నాము.. తెలుగుదేశం గ్రామ కమిటీ ప్రగడవరం

## ఇండ్లూరు నాగేశ్వర్ రెడ్డి ప్రధమ వర్ధంతి సందర్భంగా అన్నదానం



కొర్లకుంట జన సముద్రం న్యూస్ జనవరి 22ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం కొర్లకుంట గ్రామ వాస్తవ్యులు కీర్తిశేషులు ఇండ్లూరు. నాగేశ్వర్ రెడ్డి జ్ఞాపకార్థం జీవనజ్యోతి ఆనంద నిలయం శాశ్వత నిత్య అన్నదాన ఆశ్రమం నందుఅద్భుత అన్నదాన కార్యక్రమం22-01-2 025న జరిపించారు ఇండ్లూరు. నాగేశ్వర్ రెడ్డి గారి ధర్మపత్ని శ్రీమతి ఇండ్లూరు. చంగమ్మ మరియు వారి కుమార్తెలు జి.నాగమణిమ్మ.కె. చంద్రరేఖఅల్లుళ్ళు జి వెంకటసుబ్బారెడ్డి,కే .సుబ్రహ్మణ్యం రెడ్డి, మరియు మనవాళ్లు మనవరాలు అద్భుత అన్నదాన కార్యక్రమం జరిపించగా ఆకలి తీర్చుకున్న ప్రతి ఒక్కరూ కీర్తిశేషులు ఇండ్లూరు. నాగేశ్వర్ రెడ్డి వారికి ప్రత్యేక నివాళులు తెలిపారు వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పోలి. నరసారెడ్డి కొర్లకుంట గ్రామ వాస్తవ్యులు శ్రీ అంకాలమ్మ దేవాలయ కమిటీ మెంబర్ పాల్గొన్నారు.



## ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం మండల డాక్టర్ గురు మహేష్

ఓబులవారిపల్లి జన సముద్రం న్యూస్ జనవరి 22ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులు వారి పల్లి మండలం పెద్దఓ రంపాడు గ్రామపంచాయతీ పాపిరెడ్డి పల్లె22-01-25 న ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల స్క్రీనింగ్ హెల్త్ ఐడి, హెల్త్ స్క్రీనింగ్ ఎం సి డి ,సి డి, ప్రోగ్రాంలో గ్రామంలో వచ్చిన పేషెంట్లు అందరికీ బీపీ టెస్ట్ లు షుగర్ టెస్ట్ లు చేసినారు మందులు దానికి సంబంధించిన మందులు అన్ని ఇచ్చినారు ప్రత్యేకంగా మండల డాక్టర్ గురు మహేష్ పాల్గొన్నారు ప్రత్యేకంగా పాల్గొన్నారు ఎఫ్ పి డి ఆరోగ్య కేంద్రం బృందం హెల్త్ అసిస్టెంట్ ఓబులయ్య, సి హెచ్ ఓ సంధ్య, పెద్దఓరంపాడు గ్రామపంచాయతీ ఏఎన్ఎం గీతా, ఎస్ మస్తానమ్మ ,104 సిబ్బంది మొదలైన వారు పాల్గొన్నారు గ్రామస్తులు అధిక సంఖ్యలో మందుల కొరకు జ్వరాలను స్క్రీనింగ్ చేయించుకున్నారు ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుటకు విశ్రాంత కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చల్లా లక్ష్మీకర్ రెడ్డి సహకారాలు పూర్తి అందించారు.

# కార్పొరేట్ల తొత్తుగా వ్యాఖ్యానించిన విష్ణుకుమార్ రాజు- కార్మికులకు క్షమాపణ చెప్పాలి

### డిమాండ్ చేస్తున్న కార్మిక మహిళా సంఘాలు







జనశముద్రం న్యూస్,విశాఖపట్నం,జనవరి22 బిజెపి శాసనసభ్యులు పి విష్ణుకుమార్ రాజు స్టీల్ ప్లాంట్ కార్మికులపై నిన్న చేసిన తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని, కార్మికులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నేడు జీవీఎంసీ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి జేఏసీ చైర్మన్ ఎం జగ్గు నాయుడు, వైస్ చైర్మన్ ఎం మన్మధరావులు మాట్లాడుతూ స్టీల్ కార్మికులు ఇష్టం లేకపోతే రిజైన్ చేసి ,విఆర్ఎస్ తీసుకొని బయటకు పొండని విష్ణుకుమార్ రాజు అన్నారు. ఈయన పచ్చి కార్పొరేట్ల ప్రతినిధిగా ,కార్మిక వ్యతిరేకంగా మాట్లాడారు. ఈయన వ్యాఖ్యలను జేఏసీ తీవ్రంగా ఖండిస్తున్నదని, ఈ వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని, కార్మికులకు క్షమాపణ చెప్పాలని వీరు డిమాండ్ చేశారు.కేంద్రం దేశంలో ఎక్కడా లేనివిధంగా స్టీల్ ప్లాంట్ కు 11,440 కోట్లు ప్యాకేజీ ఇచ్చిందని, స్టీల్ ప్లాంట్ కార్మికులకు ఆశకు అంతం ఉండాలని, వివేకంతో మాట్లాడాలని ఆయన అన్నారు. విశాఖ ఉక్కుకు కేంద్ర ప్యాకేజీని జేఏసీ స్వాగతించింది. ప్యాకేజీ తోనే తమ బాధ్యత తీరినట్లుగా కూటమి నాయకుల ప్రకటనలున్నాయి. ఇది సరికాదన్నది కార్మికుల ప్రజల అభిప్రాయమన్నారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు నాడు కేంద్ర ప్రభుత్వం 4890 కోట్లు పెట్టుబడి పెడితే, స్టీల్ ప్లాంటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఇంతవరకు 54 వేల కోట్ల రూపాయలు ఆదాయం సమకూర్చిందన్నది రాజుగారు గుర్తుంచుకోవాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పాడి ఆవు లాంటిది. మోడీ ప్రభుత్వం దీని అమ్మకం ఆపి, సైయిల్ లో విలీనం చేసి, సొంత గనులు కేటాయిస్తే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వేలకోట్ల ఆదాయం సమకూరుస్తుంది, ప్రజలఅభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. ఈ పాడి ఆవును అదాని, మిట్టల్, పోస్కో వంటి కసాయిలకు కట్టబెట్టవద్దని ప్రజల డిమాండ్. ప్రజా ప్రతినిధిగా కృష్ణ కుమార్ రాజు కసాయిల పక్షాన కాకుండా ప్రజల పక్షాన నిలవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్యాకేజీ కూటమి ప్రభుత్వ, డబల్ ఇంజన్ సర్కారు వలనే వచ్చిందని ,కార్మికుల ప్రజల పోరాటం, సమ్మెల వల్ల కాదని బిజెపి ఎమ్మెల్యే అన్నారు. పోరాటమే లేకపోతే ఉక్కు పరిశ్రమ నిలిచి ఉండేదే కాదని, కేంద్రం దిగివచ్చేదే కాదని జగమెరిగిన సత్యం. దీనిని తక్కువ చేసి చూడడం కార్పొరేట్ల,యాజమాన్య ప్రతినిధి లక్షణం. దీనిని ఆయన బయట పెట్టుకున్నారన్నారు.విష్ణుకుమార్ రాజు ఒక వాస్తవాన్ని అంగీకరించారు. స్టీల్ ప్లాంట్ రక్షణ బాధ్యత కార్మికుల కన్నా 100 రెట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని అన్నారు. ఈ బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తించి ప్రధాని చేత విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మే నిర్ణయం రద్దు చేయించాలి. సెయిల్ లో విలీనం చేయించాలి, సొంత గనులు కేటాయించాలి.8500 మంది నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలి. ఐదువేల ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయాలి.ఆఫీసర్లు, పర్మినెంట్ కాంట్రాక్ట్ కార్మికుల జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలి .విఆర్ఎస్ , బదిలీలు పేరుతో ఆఫీసర్లు, పర్మినెంట్ కార్మికుల తగ్గింపు, టెండర్లు, 55సంవత్సరాల వయసు, మెడికల్ నిబంధనలతో వేల సంఖ్యలో కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు నిలిపివేయించాలని డిమాండ్ చేశారు. ఈ బాధ్యతలను విష్ణుకుమార్ రాజు , కూటమి నేతలు పూర్తి చేస్తే కార్మికులు ప్రజలు మీకు దండలు వేస్తారు. వీటిని సాధించకపోతే ఇదే కార్మికులు, ప్రజలు విష్ణుకుమార్ రాజును కూటమినేతలను భవిష్యత్తులో రాజీనామా డిమాండ్ చేయక తప్పదని హెచ్చరించారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. జె. అచ్యుతరావు, కే సత్యనారాయణ.....సిఐటియు జిల్లా నాయకులు వి కృష్ణారావు, ఓ అప్పారావు , పి పైడ్రాజు, కేఎం కుమార మంగళం, జి అప్పలరాజు, నగి రెడ్డి రామారావు, సి ఎఫ్ టి యు ఐ నాయకులు ఎం లక్ష్మి ,ఏ ఐ సి టి యు జిల్లా కార్యదర్శి కే శంకర్రావు ,ఐద్వా జిల్లా అధ్యక్షులు బి పద్మ ,బి ఈశ్వరమ్మ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కే. సంతోష్ కుమార్, బి గణేష్ ,ఎస్ శ్రావణ్ కుమార్ , పి సురేష్ ,కెవిపిఎస్ జిల్లా నాయకులు కే పెంటారావు తదితరులు పాల్గొన్నారు,

# రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించండి






జనసముద్రం న్యూస్,, జ్ఞానపురం, విశాఖపట్నం,జనవరి22

పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు మరియు రోడ్డు నియమాల ఉల్లంఘన దృష్ట్యా, సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఈరోజు రోడ్డు భద్రతపై అవగాహన ప్రచారాన్ని నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం మరియు విశాఖపట్నం ట్రాఫిక్ పోలీస్ శాఖ సహకారంతో కాన్వెంట్ జంక్షన్‌లోని కళాశాల ప్రాంగణంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె. మాణిక్య కుమారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. పాఠశాలలు, కళాశాలలు మరియు వినియోగదారులలో అవగాహన కల్పించడం మరియు రోడ్డు భద్రతను ప్రోత్సహించడం, సీటు బెల్టులు మరియు హెల్మెట్లు ధరించడం వంటి రహదారి భద్రతా చర్యలను వర్తింపజేయడం ద్వారా రోడ్డు ప్రమాదాల కారణంగా గాయాలు మరియు మరణాలను తగ్గించడం ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం. నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ శ్రీ. జి. మహేశ్వరరావు ప్రారంభోపన్యాసం చేసి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. విద్యార్థులను ఉద్దేశించి, ఈ రోజు అతిథి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీ. ఎం. బుచ్చి రాజు మాట్లాడుతూ, భారతదేశంలో, ఆంధ్రప్రదేశ్ మరియు విశాఖపట్నంలో గణనీయమైన శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాలు లక్షలాది మంది ప్రాణాలను కోల్పోతున్నాయి మరియు కోట్లాది మందికి తీవ్ర గాయాలవుతున్నాయి. భారతదేశంలోనే ప్రతి సంవత్సరం దాదాపు ఎనభై వేల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు, ఇది ప్రపంచవ్యాప్తంగా జరిగే మొత్తం మరణాలలో పదమూడు శాతం. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం, తప్పుడు మార్గం మరియు అనుమతించదగిన పరిమితికి మించి వేగంగా నడపడం తరచుగా రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అని ఆయన అన్నారు. రోడ్డు నియమాలను ఉల్లంఘించే వివిధ రోడ్డు ప్రమాదాల వీడియో క్లిప్పింగ్‌లను ఆయన విద్యార్థులకు చూపించారు మరియు ప్రాణాంతక ప్రమాదాలను నివారించడానికి డ్రైవింగ్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జర్నలిజం స్కూల్ వైస్ చైర్మన్ శ్రీ ఎన్. నాగేశ్వరరావు మాట్లాడుతూ, రోడ్లపై పెరుగుతున్న ట్రాఫిక్ ప్రమాదాలకు కారణమవుతోందని, ఎక్కువగా యువత రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, వారి తల్లిదండ్రులను ఓదార్చలేని దుఃఖంలో ముంచెత్తుతున్నారని అన్నారు. మరో అతిథి వక్త శ్రావ్య కూచిపూడి, జెసిఐ విద్యార్థులు మంచి సమరిటన్లుగా ఉండి, ప్రమాదాలలో గాయపడిన వారికి సహాయం చేయాలని మరియు ట్రాఫిక్ పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మంచి సమరిటన్లను ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలతో సత్కరిస్తుందని ఆమె అన్నారు. తరువాత, విద్యార్థులు రైల్వే స్టేషన్ ద్వారా జ్ఞానపురం మరియు కాన్వెంట్ జంక్షన్ వీధుల్లో రోడ్డు నియమాలపై సందేశాలున్న ప్లకార్డులను పట్టుకుని భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనదారులు మరియు ఆటోరిక్షా డ్రైవర్లు భద్రతా జాగ్రత్తలను పాటిస్తూ జాగ్రత్తగా నడపాలని వారు వివరించారు. ట్రాఫిక్ పోలీసులతో పాటు ద్విచక్ర వాహనదారులు, పిలియన్ డ్రైవర్లు హెల్మెట్లు ధరించాలని వారు సూచించారు. వారు అన్ని వాహన డ్రైవర్లను సిగ్నల్ లైట్లను పాటించాలని మరియు మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగంగా వాహనం నడపడం మరియు రోడ్డు నిబంధనలకు వ్యతిరేకంగా డ్రైవింగ్ చేయడం వల్ల కలిగే ప్రాణాంతక ప్రభావాల గురించి వివరించారు. సురక్షితమైన ప్రయాణానికి జీబ్రా లైన్లను ఉపయోగించాలని వారు నడిచేవారికి చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీనియర్ షైజీ విద్యార్థులు చేపట్టిన రోడ్డు భద్రతా కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎ ఎమ్ వి ఐ – విశాఖపట్నం శ్రీ సుమన్ కుమార్, కళాశాల అధ్యాపక డాక్టర్ టోనియా గ్రేస్, డాక్టర్ ప్రవీణ్ బాబు, బోధనేతర సిబ్బంది బి. రాజేష్, ప్రసాద్, ఆనంద్, రామ మరియు 100 మందికి పైగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# ఎవ్వరికీ ఇబ్బంది లేని స్థలంలో.. బ్రతుకు దెరువు కోసం ఏర్పాటు చేసుకున్న చిన్న దుకాణాన్ని తొలగించి నష్టం చేయడం దుర్మార్గం

### రామాపురం మండలం రాచపల్లె లో తొలగించిన చిన్న దుకాణంను పరిశీలించి, బాధితులను పరామర్శించిన వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి



రాయచోటి జనవరి ,22 జనసముద్రం న్యూస్

బ్రతుకుదెరువు కోసం ఏర్పాటు చేసుకున్న చిన్న దుకాణాన్ని తొలగించి నష్టం చేయడం దుర్మార్గమని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రామాపురం మండలం రాచపల్లె పంచాయతీలోని సచివాలయం, పాఠశాల సమీపంలో గణేష్ కుమార్ రెడ్డి బ్రతుకు తెరువు కోసం ఏర్పాటు చేసుకున్న చిల్లర దుకాణాన్ని తొలగించి నేలమట్టం చేసిన శిథిలాలను బుధవారం శ్రీకాంత్ రెడ్డి పరిశీలించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ నిబంధనలకు వ్యతిరేఖంగా ముఖ్యమంత్రే అధికార నివాసం ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఎవ్వరికీ ఏ అడ్డు లేని ప్రాంతంలో బ్రతుకు తెరువు కోసం చిన్న అంగడి పెట్టుకున్న వారిపై రాజకీయ కోణంతో కొట్టివేయడం సమంజసం కాదన్నారు. గతంలో ఇలాంటి పనులు ఎన్నడు జరగలేదన్నారు. బాధితుల కన్నీరు చూసినప్పుడు చాలా బాధేస్తుందన్నారు. ఎప్పటి నుంచో వారు చిన్న అంగడి పెట్టుకున్న వారు గతంలోనే పాఠశాలకు 2 ఎకరాల సొంత భూమిని వితరణగా ఇచ్చియున్నారన్నారు. ఇప్పటికీ 46 సెంట్ల భూమి వాళ్ళ పేరు మీద రెవెన్యూ రికార్డులలో ఉందన్నారు. పదిమందికి విద్యనందించే పాఠశాల కోసం ఉచితంగా స్థలం అందించిన వారిపైనే రాజకీయ కోణం ఆస్వాదించి బ్రతుకుతెరువు కోసం పెట్టుకున్న చిన్న దుకాణాన్ని తొలగించి నష్టం కలుగ చేయడం దుర్మార్గమన్నారు. మీకు దమ్ముంటే ఇలా అన్ని ప్రాంతాలలో తొలగింపులు చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. ఆర్ అండ్ బి కి సంబందించిన స్థలంలో ఆర్ అండ్ బి వాళ్ళు స్పాట్ లో లేకున్నా పోలీసు, రెవెన్యూ శాఖల వాళ్ళు ఏ విధంగా తొలగిస్తారన్నారు. చిన్న చిన్న విషయాలలో రెవెన్యూ వారు జోక్యం చేసుకోవడం మంచి పరిణామం కాదన్నారు. అదే గ్రామంలోనే కొంతమంది ప్రభుత్వ భూములను దౌర్జన్యంగా ఆక్రమించి కంచెలు వేస్తుంటే రెవెన్యూ వారు చోద్యం చూస్తున్నారన్నారు. రైతులు పొలాల్లోకి మట్టి తోలు కుంటుంటే వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. తప్పులు చేస్తున్న వారిని, అన్యాయంగా దూరాగతాలకు పాల్పడుతున్న వారికి భవిష్యత్ లో గుణపాఠం తప్పదని శ్రీకాంత్ రెడ్డి హెచ్చరికలు చేశారు. పరామర్శ...రాచపల్లెకు చెందిన వెంకట్రామరాజు ఇటీవల మోకాలుకు ఆపరేషన్ చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి పొందుచున్నారు. వెంకట్రామరాజు నివాసానికి శ్రీకాంత్ రెడ్డి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులనడిగి తెలుసుకున్నారు.

# సిసి రోడ్లు ప్రారంభించిన నల్ల గోపు కృష్ణమూర్తి 16 వార్డ్ నెంబర్

జనసముద్రం ఏలూరు జిల్లా చింతలపూడి జనవరి 22 ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం పంచాయతీ పొనుకుమాడు ఎస్సీ పేట లో సీసీ రోడ్ ప్రారంభించడం జరిగింది. వార్డు మెంబర్ నల్ల గోపు కృష్ణమూర్తి పంచాయతీ సెక్రెటరీ వసంత వాణి జగదీష్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనడం జరిగింది.





# రీ సర్వేపై అవగాహన కార్యక్రమం.

జన సముద్రం న్యూస్ దొనకొండ ప్రతినిధి దొనకొండ స్థానిక మేజర్ పంచాయతీ నందు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే కార్యక్రమాన్ని దొనకొండ మండల తాసిల్దార్ బి, రమాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో కనిగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి జి కేశవ వర్ధన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులతో మాట్లాడుతూ దొనకొండ మండలంలో భూముల రీ సర్వే లో భాగంగా మొదటగా పైలట్ ప్రాజెక్టు వీర వెంకటాపురాన్ని ఎన్నిక చేసి సర్వే చేయడం జరుగుతుందని, రీ సర్వే సిబ్బంది రెండు రోజులు ముందుగానే నోటీసులు ఇవ్వడం జరుగుతుందని ఎవరికైతే నోటీసులు అందుతాయో వారు రీ సర్వేకి సహకరించి వారి భూమిని రి సర్వే చేయించుకోవాలని, అదేవిధంగా గత ప్రభుత్వంలో లాగా రీ సర్వే హడావుడిగా చేయకుండా , ఈ ప్రభుత్వం నాలుగు నెలల సమయాన్నికేటాయించిందని ఈ సమయంలో పు రైతులు సద్వినియోగం చేసుకోవాలని, గ్రామాల్లో అందుబాటులో లేని రైతులకు వాట్సాప్ ద్వారా కూడా నోటీసులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు, వీర వెంకటాపురం లో 314.74 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నటువంటి భూమిని , ఎవరైతే భూమిలో సాగు చేస్తూ ఉంటున్నారో వారు రీ సర్వే సంబంధిత సిబ్బంది వచ్చినప్పుడు వారితో సహకరించి ఆ భూమికి సంబంధించిన తగు ఆధారాలతో రీసర్వే చేయించుకోవాలని, ఈ రీ సర్వే వల్ల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అదేవిధంగా రీ సర్వేలో మొట్టమొదటగా గ్రామ కంఠాన్ని విభజించి, ప్రభుత్వ స్థలాలు, స్మశానవాటికలు, దేవాలయాల భూములు కూడా రి సర్వే చేయడం జరుగుతుందని, ఒకవేళ ఎవరైనా రైతులు వారి పొలం కి దగ్గర్లో ఉన్న ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నా వారికి ఎంతైతే పాస్బుక్ లో ఆన్లైన్ ఉంటుందో అంత మాత్రమే వారికి సర్వే చేయించడం జరుగుతుంది అని, మిగతా భూమిని ప్రభుత్వ భూమిగా కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేశవర్ధన్ రెడ్డి , దొనకొండ తహసిల్దార్ బి రమాదేవి,డిప్యూటీ ఇన్స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్ , దర్బార్ మస్తాన్ వలి, డి. మాచర్ల శివ కోటేశ్వరరావు, గ్రామ సర్వేయర్ ధనలక్ష్మి, గ్రామ సర్వేయర్ ఎం శ్రీను. రైతులు తదితరులు పాల్గొన్నారు

# యువ మంత్రివర్యులు లోకేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా భారీ కేక్ కటింగ్, గొప్ప అన్నదానం,

### కుట్టు మిషన్ లు పంపిణీ




ముక్కా వారి పల్లి మీ సాక్షి న్యూస్ జనవరి 22 ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం ముక్కావారి పల్లె సమీపంలోని అప్పారావు సర్కిల్ కాశీనగరం నందు ఆంధ్రప్రదేశ్ ఐటి మరియు విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా భారీ కేక్ కట్ చేయనున్నారు అనంతరం భారీ అన్నదానం అనంతరం పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ అనంతరం వృద్ధులకు దివ్యాంగులకు బాల బాలికలకు కాస్మెటిక్ చార్జీ నగదు సహాయం అందిస్తున్నారని ఎన్నారై టిడిపి ఉమెన్స్ త్రైవ్ ఏ పీ ఫౌండర్ రషీధా వారి సమాచారం మేరకు ఆంధ్రప్రదేశ్ ఐటి విద్యాశాఖ మంత్రివర్యులు మరియు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఎన్ఆర్ఐ ఉమెన్స్ త్రైవ్ ఏ పీ ఫౌండర్ రషీద సమాచారం మేరకు సీనియర్ నాయకులు పామూరు రామసుబ్బారెడ్డి (రామిరెడ్డి), విశ్రాంత కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చల్లా లక్ష్మీక రెడ్డి, జీవనజ్యోతి ఆనంద నిలయం చైర్మన్ మరియు ఏపీ పిటిడి డి ఇ ఏ రాష్ట్ర అధ్యక్షులు పాణ్యం సుబ్రహ్మణ్యం స్వామి ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా పాల్గొని జరిపిస్తున్నారని జీవనజ్యోతి ఆనంద నిలయం వర్కింగ్ మేనేజర్ దట్టమ్ రఘురామయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

# సిజిఆర్ఎఫ్ వారి ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక




(జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా గోపాలపురం నియోజవర్గం ప్రతినిధి) ద్వారకాతిరుమల , జనవరి 22 : సిజిఆర్ఎఫ్ వారి ఆధ్వర్యంలో ఏపీఈపీడీసీఎల్ వారు ఈ నెల జనవరి 24 వ .తేదీన ద్వారకాతిరుమల మండల పరిధిలో ఉన్న విద్యుత్ వినియో గదారులకు ద్వార కాతిరు మల మండల విద్యుత్ శాఖ ఆఫీసు ఆవరణలో విద్యుత్ విని యోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించ బడును. కావున విద్యుత్ వినియో గదారు లందరూ ఈ అవకాశమును వినియోగించుకుని మీకు ఉన్న విద్యుత్ సమస్యలకు పరిష్కారము పొందవల సినదిగా కోరడమైనది. ఈ సమావేశమునకు సి.జి.ఆర్.ఎఫ్ చైర్ పర్సన్ డా.బి.సత్యనారాయణ,సాంకేతిక సభ్యులు ఎస్.మసీల మణి, ఆర్థిక సభ్యులు షేక్ బాబర్, మరియు స్వతంత్ర సభ్యులు ఎన్.మురళీ కృష్ణ,హాజరువుతున్నారని సి.జి.ఆర్. ఎఫ్. కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.



# అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్

జనసముద్రం న్యూస్ కోహెడ జనవరి 22: (కోహెడ ప్రసాదరావు) అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని ఎవరు గందరగోళానికి గురికా వద్దని సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం నకిర కొమ్ముల గ్రామంలో బుధవారం జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నాలుగు పథకాల కింద లబ్దిదారులను ఎంపిక చేస్తుందని తెలిపారు. నూతనంగా రేషన్ కార్డులను జారీ చేయటము కుటుంబ సభ్యులను కార్డుల్లో చేర్చడం వంటి ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైన నిరుపేద కుటుంబాలను ఎంపిక చేస్తామని తెలిపారు. రైతు భరోసా క్రింద సాగు భూములకు మాత్రమే లబ్ధి చేకూరుతుందని స్పష్టం చేశారు. గతంలో మాదిరిగా గుట్టలకు, వ్యవసాయేతర భూములకు రైతు భరోసా రాదని స్పష్టం చేశారు. గ్రామ సభలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని ఆయన అన్నారు. అధికారులు సహితం గ్రామస్తుల నుండి దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సురేఖ వివిధ శాఖ అధికారులు గ్రామ కార్యదర్శి మాజీ ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కూనూరులో గ్రామ సభలో సంక్షేమ పథకాలలో అర్హులకు అన్యాయం జరిగిందని ప్రజల ఆందోళన

యాదాద్రి భువనగిరి జిల్లా జనవరి. 22,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:

జనసముద్రం న్యూస్ భువనగిరి మండలంలో కూనూరు గ్రామంలో ప్రజాపాలన గ్రామసభ వాయిదా వేయాలని జాబితాలో పేర్లు లేని బాధతులు ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రభుత్వం అధికారాలతో లిస్ట్ లో పేరు లెని నిరుపేద కుటుంబాలకు తీరని అన్యాయం జరుగుతున్నది.ప్రజాపాలన ధరఖాస్తులు పెట్టుకున్న ధరకాస్తు ధరల పేర్లు లేకపోవడం పెద ప్రజలు తీరని నష్టం జరుగుతున్నది. సంక్షేమ పథకాలు కేవలం కాంగ్రెస్ పార్టీ నాయకులకు మాత్రమే లబ్ది చేగుర్చే విధంగా లిస్ట్ తాయారు చేసారు.కూనూరు గ్రామంలో గ్రామ ప్రజలు ప్రజాపాలన కార్యక్రమంలో అధికారులకి ఎదురు తిరిగి నిలతీశారు.ప్రజాపాలన ధరఖాస్తులు పెట్టుకున్నపట్కి జాబితాలో పేర్లు లేవు రాలేదు లిస్ట్ లో పేర్లు రాలేదు అని దినితో ఆగ్రహించిన కూనూరు గ్రామ ప్రజాలు,బాధితులు నిరుపేద ప్రజలు ఎదురు తిరిగారు,కాంగ్రెస్ నాయకులు,అధికారులు భువనగిరి గ్రామీణ ఎస్సైకి ఫోన్ చేసి పోలీస్ లను పిలిచి బంధోబస్తు మధ్యలో ప్రజా పాలన నిర్వహించడం జరిగింది.దినితో ప్రజలు చాలా ఇబ్బంది పడుతు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక కొంత సేపు అధికారులను నిలదీయడం జరిగింది.అధికారులు సమాధానం చెప్పలేక పోలీస్ కు ఫోన్ చేసి పోలీస్ బందోబస్తు ద్వారా ప్రజాపాలన కార్యక్రమం జరిపారు.కాంగ్రెస్ నాయకులు ధౌర్జన్యంగా మాట్లాడుతు మీకు ఇల్లు రాదు లిస్ట్ లో నేనే పేరు కావాలని



తొలగించానని ఏం ఎంచేసుకుంటావో చేసుకోపో అని బెదిరిస్తు వారికి నచ్చిన వాలకు మాత్రమే లిస్ట్ లో పేర్లు ఉండి నచ్చని వారి పేర్లు తొలగిస్తున్న అధికారం ఉంది కదా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు.రూరల్ పోలీస్ స్టేషన్ కి ఫోన్ చేసి పోలీస్లతో మీకు ఏమైన సమస్యలు ఉంటె అర్ డి వో తో మాట్లాడుకోండి.అక్కడ ధరకాస్తులు పెట్టుకోండి అని తెలిపి ప్రజాపాలన కొనసాగించారు.ధీనితో ప్రజలు తా బాధలను సమస్యలు చెప్పినా పట్టించు కోకుండా ప్రజాపాలన కొనసాగించారు.

# రాష్ట్ర మంత్రులకు ఘన స్వాగతం పలికిన వెలిచాల రాజేందర్ రావు

(జనసముద్రం న్యూస్ కరీంనగర్ ప్రతినిధి జనవరి 22)

కరీంనగర్ పర్యటనకు విచ్చేసిన జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర నీటిపారుదల పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు కరీంనగర్ లోని హెలిప్యాడ్ వద్ద బుధవారం కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ఘన స్వాగతం పలికారు. మంత్రులను శాలువాలతో సత్కరించారు. అనంతరం తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామంలో జరిగిన గ్రామసభకు మంత్రులతోపాటు రాజేందర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెలిచాల రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 26వ తేదీ నుంచి నాలుగు పథకాలను ఏకకాలంలో అమలుకు శ్రీకారం చుట్టబోతున్నారని పేర్కొన్నారు. ఇంత పెద్ద ఎత్తున ఒకేసారి నాలుగు పథకాలను ప్రారంభించుకోవడం ఏ రాష్ట్రంలోనూ జరగలేదని తెలిపారు. నాడు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నదని చెప్పారు. అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 12 వేల రూపాయలు ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు.



దీంతోపాటు రైతులకు ఏటా 12 వేల రూపాయలను రైతు భరోసా కింద అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వెలిచాల రాజేందర్ రావ్ సూచించారు. అర్హులైన పేదలందరికీ పథకాలు అందుతాయని పేర్కొన్నారు.

# గోరీలు కూల్చి స్మశాన వాటికను ఆక్రమించుకున్న నిందితులను 17 రోజులు గడుస్తున్న ఎందుకు అరెస్టు చేయడం లేదు?

**దళితుల గోరీలు కూల్చిన నిందితులపైన నేటికీ ఎందుకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం లేదు?**

**ఈనెల 30 లోపు నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్టు చేయకపోతే ఫిబ్రవరి 3వ తేదీన పోలీస్ స్టేషన్ ముట్టడిస్తాం**

**-కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం హెచ్చరిక**

యాదాద్రి భువనగిరి జిల్లా జనవరి. 22,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:

జనసముద్రం న్యూస్ భువనగిరి మండల పరిధిలోని తుక్కాపురం గ్రామంలో అక్రమంగా కూల్చిన గోరీలను కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు,బాధిత కుటుంబాలతో కలిసి పరిశీలన చేయడం జరిగింది.ఈ సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు కొండమడుగు నర్సింహ,జిల్లా కార్యదర్శి అన్నంపట్ల కృష్ణ లు మాట్లాడుతూ 100 సంవత్సరాలకుపైగా తమ కుటుంబాలకు సంబంధించినవారు చనిపోతే వారిని బొందపెట్టి,గోరీలను నిర్మాణం చేసుకున్న వాటిని పక్కనే ఉన్న కంఠం దయాకర్,కంఠం దినేష్ అక్రమంగా రాత్రికి రాత్రి జేసిబిలతో ఆ గోరిలను కూల్చి,బొందలను తవ్వి బాయి కుంటలో పోయడాన్ని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ నిందితులపై వెంటనే ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని పోలీస్ అధికారులను,ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు.తొక్కపురం గ్రామంలోని సర్వే నెం.113లో 1- 20 గుంటల భూమిలో గ్రామం ఏర్పడ్డ నుండి సుమారుగా 150 సంవత్సరాలకుపైగా గ్రామంలో ఎవరు చనిపోయిన ప్రధానంగా దళితులు చనిపోతే ఆ భూమిలో బొందలు పెట్టడం,కాల్చడం చేసిన తర్వాత ఆర్థిక స్తోమతను బట్టి గోరీలు కూడా నిర్మాణం చేసుకున్నారని అన్నారు.ఆ స్మశాన వాటిక పక్కనే భూమి కలిగిన కంఠం దయాకర్,కంఠం దినేష్ ఆ భూమిని ఆక్రమించుకోవడానికి కుట్రపూరితంగా రాత్రికి రాత్రి అయిదారు జెసిబిలతో మొత్తం గోరీలను,బొందలను తవ్వి అతి దారుణంగా వాటన్నింటినీ బాయి బొందలో పోసి పూడ్చడం దారుణమని అన్నారు.అనేకమంది తమ తల్లిదండ్రులు,తాత,ముత్తాతల ఆనవాలను గొరిల్లా రూపంలో చూసుకుంటుంటే ఆ గోరిలను తవ్వి వారి యొక్క అస్థికలను కూడా తీసేయడం హేయమైన చర్యని వారు విమర్శించారు.జనవరి 5న నిందితులు గోరీలను తవ్వితే ఆరవ తేదీన జిల్లా కలెక్టర్,స్థానిక



భువనగిరి పిఎస్ లో కంప్లైంట్ చేసిన నేటికీ నిందితులపై కేసులు నమోదు చేసి ఎందుకు అరెస్టు చేయలేదని వారు ప్రశ్నించారు.ఎక్కువ శాతం దళితుల గోరీలనే ధ్వంసం చేశారని మరి అలాంటి పరిస్థితులలో వారిపైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం ఎందుకు నమోదు చేయలేదని స్థానిక రూరల్ పోలీసులను ప్రశ్నించారు.ఆ గ్రామంలో ప్రజలంతా గత 17 రోజులుగా ఆందోళన చెందుతుంటే కూతవేటు దూరంలో ఉన్న జిల్లా కలెక్టర్, స్థానిక తహశీల్దార్ ఎందుకు స్పందించడం లేదని ఎవరి పక్షాన అధికారులు,పోలీసు యంత్రాంగము ఉన్నారని వారు ప్రశ్నించారు.ఇప్పటికైనా ప్రభుత్వము,పోలీసు యంత్రాంగం స్పందించి నిందితుల పైన కేసులు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని,చుట్టూ ఫినిషింగ్ ఏర్పాటు చేసి ఆ స్మశాన వాటికకు రక్షణ కల్పించాలని,ఈనెల 30 లోపు నిందితులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయకపోతే ఫిబ్రవరి మూడో తేదీన పోలీస్ స్టేషన్ ముందు వందలాది మందితో ధర్నా నిర్వహిస్తామని నర్సింహ,కృష్ణ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు దుబ్బ లింగం,గ్రామం మాజీ ఎంపిటిసి నల్లమాసు సత్య నారాయణ,మాజీ సర్పంచ్ నోముల పద్మ మహేందర్ రెడ్డి,ఉప సర్పంచ్ ముంత సతీష్,గ్రామ ప్రజలు బాధితులు రత్నపురం పురుషోత్తం,ఏడుమేకుల మహేష్,ఎదునూరి చంద్రపాల్, రాచకొండ పాండు,కుమార్,చంద్రయ్య,లింగస్వామి,రాసాల శేఖర్,జనగాం అశోక్,స్వామి, సత్తయ్య, శంకరయ్య,శ్రీను,భువనగిరి నగేష్,ఎలకొండ సుధాకర్,రాసాల శరత్,రత్నపురం బిక్షపతి,పాండరి,పిట్టల జమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియలా కొనసాగించాలి

**వార్డు సభ ద్వారా ప్రజా ప్రభుత్వాన్ని , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరిన బోడ రమేష్ నాయక్**

**లంబాడి హక్కుల పోరాట సమితి మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు**

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ జనవరి 22 మహబూబాబాద్ పట్టణ మున్సిపాలిటీ పరిధి పదో వార్డులో ఏర్పాటు చేసిన వార్డు సభలో ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు బోడ రమేష్ నాయక్ మాట్లాడుతూ మానుకోట అతిపెద్ద గిరిజన జిల్లా. ఈ జిల్లాలో ఉన్నటువంటి నిరుపేద ప్రజలకు, అర్హులైన ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు కావచ్చు, రేషన్ కార్డు కావచ్చు, పింఛన్లు కావచ్చు విడతల వారీగా కాకుండా నిరంతర ప్రక్రియ కొనసాగించే విధంగా చూడాలని ఈ వార్డు సభ ద్వారా ప్రజా ప్రభుత్వాన్ని, గౌరవ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ రేవంత్ రెడ్డి గారిని కోరారు. గత ప్రభుత్వంలో 10 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క ఇల్లు కానీ, రేషన్ కార్డు గాని ఇవ్వని చరిత్ర గత ప్రభుత్వానికి దక్కింది. అలాంటి విధానాన్ని కాకుండా ప్రజలకు అనుగుణంగా అర్హులైన పేదవారందరికీ వారు ఎప్పుడు కోరుకుంటారో అప్పుడు ఇందిరమ్మ ఇల్లు కావచ్చు, పెన్షన్ కావచ్చు, రేషన్ కార్డు కావచ్చు ఇచ్చే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ స్పెషల్ ఆఫీసర్



శ్రీనివాస్, పదవ వార్డ్ కౌన్సిలర్ భూక్య శ్రీను నాయక్, కమిటీ సభ్యులు రాములు నాయక్, నరేష్ నాయక్, రవి నాయక్, బద్రు నాయక్ గుగులోతు వెంకన్న (వంశీ) నాయక్, రవి నాయక్, వీరు నాయక్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఏజెండా,

**దెందుకూరు సొసైటీ చైర్మన్ కోట వెంకటకృష్ణ**

జనసముద్రం న్యూస్ ప్రతినిధి మధిర జనవరి 22, ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపటమే ప్రధాన ఏజెండా చేసుకొని అనునిత్యం శ్రమిస్తున్నానని ప్రతి సంక్షేమ పథకం దెందుకూరు గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూస్తానని కాంగ్రెస్ పార్టీ నాయకులు దెందుకూరు సొసైటీ చైర్మన్ కోట వెంకటకృష్ణ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు,రైతు భరోసా,కొత్త రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఈ నాలుగు సంక్షేమ పథకాల అమలుపై ఏర్పాటు చేసిన ప్రజా పాలన గ్రామ సభలో కోట వెంకటకృష్ణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వెంకటకృష్ణ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామంలో ప్రతి ఒక్కరికి అందేలా చూస్తామన్నారు.ప్రభుత్వం చేపట్టిన సర్వేల ఆధారంగా జాబితాలో నమోదైన వారికి సంక్షేమ పథకాలు 100శాతం అందుతాయని,ఇందులో ప్రజలెవరూ ఎలాంటి సందేహాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,కాంగ్రెస్ పార్టీ



నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# నెమరగోములలో రసాభాసగా జరిగిన గ్రామసభ

యాదాద్రి భువనగిరి జిల్లా జనవరి. 22,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:

జనసముద్రం న్యూస్ బీబీనగర్ మండలం నెమరగోముల గ్రామంలో ప్రజాపాలన గ్రామసభ ను అడ్డుకున్న బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు,గ్రామ ప్రజలు.అధికారులకు,బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల మధ్య వాగ్వాదం.జాబితాలో లేని నిజమైన లబ్ధిదారుల పేర్లు,అధికారులు ఏ ప్రాతిపదికన ఈ జాబితా చేశారో చెప్పాలంటూ అధికారులను నిలదీసిన ప్రజలు.అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో పనిచేస్తున్నారా సమాచార లోపంతో ఇలా చేస్తున్నారా చెప్పాలంటూ వాగ్వాదానికి దిగిన గ్రామ ప్రజలు,బిఆర్ఎస్ నాయకులు.పోలీసులు సర్ది చెప్పటంతో సద్దు మణిగిన వివాదం.



# కల్వకుంట్ల ఎమ్మెల్సీ కవిత తో క్యాలెండర్ ఆవిష్కరణ బిఆర్ఎస్ నాయకులు

జన సముద్రం న్యూస్ జిల్లా ప్రతినిధి

యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ ఆఫీసులో కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా మరియు భువనగిరి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి బి ఆర్ ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా పార్టీ క్యాలెండర్ ఆవిష్కరించారుఇట్టి కార్యక్రమంలో బి ఆర్ ఎస్ భువనగిరి మండల పార్టీ అధ్యక్షుడు జనగాం పాండు గారు, కొలుపుల అమరేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్నపోయిన ఆంజనేయులు, టౌన్ అధ్యక్షులు కిరణ్ కుమార్, జిల్లా యువజన నాయకులు ర్యాకల శ్రీనివాస్, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, రాసాల మల్లేష్, పుట్ట వీరేష్ యాదవ్, సిలివేరు మధు, మూల నాగేంద్రబాబు, సూరజ్, జనగా మహేష్, బిఆర్ఎస్ అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# వేద ప్లేస్కూల్ సందర్శించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జన సముద్రం న్యూస్ జిల్లా ప్రతినిధి

వేద ప్లే స్కూల్ ను సందర్శించిన ఎమ్మెల్సీకల్వకుంట్ల కవిత నేడు నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భువనగిరిలో జగదేవ్పూర్ పూర్ చౌరస్తా లో గల వేధ ప్లే స్కూల్ ను సందర్శించడం జరిగింది .ఈ సందర్భంగా స్కూల్ ను సందర్శన చేసి యజమాన్యం అవలంబించే కొత్త విద్యా విధానం ను ఆడిగి తెలుసుకున్నారు అలాగే అక్కడ ఉన్నా విద్యార్థుల తో మాట్లాడి వారితో గడిపి సంతోషాన్ని వ్యక్త%శీ% చేసారు అదేవిధంగా యాజమాన్యం తో మాట్లాడి మీ స్కూల్ లో ఉన్న పిల్లలకు మంచి విద్యను అందించి వారికి మంచి భవిష్యత్తు కు బాటలు వేయాలి కోరారు అలాగే ఇలాంటి విద్య వ్యవస్థలను ఎన్నో స్థాపించి మంచి విద్యను అందించాలని కోరారు ఇలాంటి ఆక్టివిటీవిద్య వ్యవస్థను స్థాపించినందుకు యాజమాన్యం ను అభినందించడం జరిగింది అదే విధంగా వారికి పుష్పగుచ్ఛం ను ఇచ్చి ఆహ్వానించి వారికి ఈ సందర్భంగా ధన్యవాదములు తెలియచేశారు ఈ కార్యక్రమం లో యాజమాన్యం మరియు ప్రిన్సిపాల్ వెల్దుర్తి నిఖిత ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు .



# బొమ్మనపల్లిలో టిబి వ్యాధి పై అవగాహన

చిగురుమామిడి జన సముద్రం న్యూస్ 22:కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామంలో టీబి వ్యాధిపై టిబి అలెర్ట్ ఇండియా కమ్యూనిటీ కోఆర్డినేటర్ బి పారిజాతం మాట్లాడుతూ ఈ సందర్భంగా రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఆకలి లేకపోవడం బరువు తగ్గడం ఇలాంటి లక్షణాలు ఉన్నప్పుడు దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేపించుకోవాలి అన్నారు.వ్యాధి ఉన్నట్లయితే ఉచితంగా మందులు ఇస్తామని,బొమ్మనపల్లి గ్రామంలో ఈ విధమైనటువంటి లక్షణాలు ఎవరికైనా కనిపించినా గ్రామ ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.100రోజులు టిబి అవగాహన కార్యక్రమం కూడా గ్రామాల్లో చేయడం జరుగుతుందన్నారు.పూర్తిగా బొమ్మనపల్లి గ్రామాన్ని టిబి రహిత గ్రామంగా చేయాలని ఉద్దేశించి గ్రామంలో అవగాహన కల్పిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ స్పెషల్ ఆఫీసర్ సువిశాల,పంచాయతీ కార్యదర్శి నాగరాజు,మాజీ సర్పంచ్ భూమిరెడ్డి,ఎం ఎల్ హెచ్ పి గిరిజ,ఎంపీహెచ్ఏఎఫ్ జి ధనలక్ష్మి, జి స్వరూప,ఆశ వర్కర్స్ గ్రామపంచాయతీ సిబ్బంది టీవీ చాంపియన్,గ్రామస్తులు పాల్గొన్నారు.

జనసముద్రం
ప్రతి అక్షరం జనం కోసం న్యూస్



## 2 లక్షల రూపాయలతో 36వ వార్డులో సీసీ డ్రైనేజీ నిర్మాణం పనులు.

### పర్యవేక్షించిన సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి

### 36వ వార్డు కౌన్సిలర్ బి నీరజారెడ్డి ధర్మన్న



మహాబూబబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ జనవరి 22 మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డులోని కృష్ణ కాలనీ రోడ్డులో మరియు చైతన్య స్కూల్ రోడ్డుకు కనెక్ట్ అయ్యేలా సీసీ డ్రైనేజీ నిర్మాణం 2 లక్షల రూపాయలతో నిర్మాణం జరుగుతున్న సందర్భంగా నేడు కౌన్సిలర్లు పనులను పర్యవేక్షించారు ఈ సందర్భంగా సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సార్ధిరెడ్డి 36వ వార్డు కౌన్సిలర్ బి నీరజారెడ్డి ధర్మన్న లు మాట్లాడుతూ 36వ వార్డు అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు 36వ వార్డులో సీసీ రోడ్లు సిసి డ్రైనేజీలు మరియు చిల్డ్రన్స్ పార్కులు సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా అహర్నిశలు కృషి చేసినట్టు వారు తెలిపారు వార్డు అభివృద్ధికి మున్సిపాలిటీలో ఇటు ప్రజాక్షేత్రంలో ఆందోళనలు చేసి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో గాదం శ్యాం ప్రసాద్ యాదవ్ మెతుకు కుమార్ నునావత్ బాలు భూక్య పరమేశ్వర్, పదిర లచ్చయ్య పెరుగు కుమార్ కాలనీవాసులు పాల్గొన్నారు



## సమస్యల సత్వర పరిష్కారమే అభివృద్ధి. ధ్యేయం

### మాజి జాతియాబిసికమీషన్ సభ్యులు తల్లోజ్ ఆచారి.

జన సముద్రం ప్రతినిధి పి శ్రీనివాస్. అమనగల్ పట్టణంలో రూ. 5లక్షలతో మున్సిపల్ జర్నల్ ఫండ్ నిధులతోసిసి రోడ్ పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. సిసి రోడ్ పనులను ప్రారంభిస్తున్న6 వ వార్డ్ కౌన్సిలర్. దివ్య శ్రీకాంత్ సింగ్. సాయి నగర్ కాలనీలో కోట తిరుపతయ్య. ఇంటి వద్దా నుండి ఎరువ విజయ్. ఇంటి వరకు. ఉంటుందని తెలిపారు. అందు బాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి సత్వరమే చొరవ చూపాలని జాతీయ ఓబీసీ కమీషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి సూచించారు. అన్ని వార్డుల అభివృద్ధికి పాటుపడాలని అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యులు చేయాలని ఆయన కోరారు. స్థానిక కౌన్సిలర్ దివ్యశ్రీకాంత్ సింగ్ పనులను ప్రారంభించారు. అనంతరం ప్రజలతో మాట్లాడి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీలో సీసీ రోడ్లు వేగవంతంగా జరుగుతున్నాయని దశల వారీగా అన్ని వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమంగల్ మున్సిపాలిటీ చైర్మన్ రాంపాల్ నాయక్. మాజీ జడ్పిటిసి. కండే హరిప్రసాద్. కౌన్సిలర్ విజయ్ కృష్ణ. శ్రీశైలం యాదవ్. సూండుర్ శేఖర్. చెన్నకేశవులు. కో ఆప్షన్ నెంబర్ శ్రీధర్. బూత్ అధ్యక్షులు గుజ్జరి శ్రీను. ఉపాధ్యక్షులు కామోజీ సాయికుమార్. బిజెపి నాయకులు రామ్ రెడ్డి. శ్రీశైలం యాదవ్. శీను. గజ్జి బాలకృష్ణ . సుభాష్. కాలనీ వాసులు పాల్గొన్నారు.

## రెండో రోజు ఆనందమయంగా కొనసాగినా పోలీస్ క్రీడోత్సవాలు

### మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్ నెత్రుత్వంలో





మహాబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ జనవరి 22

మహబూబాబాద్ జిల్లా పోలీస్ అన్యూవల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ –2025 రెండవ రోజు అదే జోరుతో కనసాగింది. జిల్లా పోలీసుల మధ్య క్రికెట్, కబ్బాడి, వాలీబాల్, లాంగ్ జంప్, షాట్ పుట్, 400,1500,5కమ్ పరుగు పందెం, చెస్, క్యారెమ్స్, మొదలగు అన్ని నిర్వహించారు. రేపు క్రికెట్, వాలీబాల్, కబ్బాడి ఇతర అంశాలలో ఫైనల్ పోటీలు నిర్వహించి సాయంత్రం క్లోసింగ్ సర్మనీ కార్యక్రమంలో ముఖ్య అతిధి గా జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఐఏఎస్ మరియు విశిష్ట అతిధి డీఎఫ్ఓ విశాల్ ఐఎఫ్ఎస్సి చేతుల మీదుగా క్రీడాలో గెలుపొందిన వారికీ బహుమతులు ప్రధానోత్సవం ఉంటుంది.



## అమ్మను మించిన దైవం లేదు.....

## అందుకే అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి

### హరిత మిత్ర అవార్డు గ్రహీత. దైద వెంకన్న

మహాబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ జనవరి 22మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రజా హృదయం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరా నగర్ కు చెందిన కొండపాకల జగన్ కు పువ్వులా మొక్కలు షో మొక్కలు పంపిణి చేశారు. ప్రధాన మంత్రి పిలుపు మేరకు అమ్మ హరిత దీక్షలో భాగంగా అమ్మ పేరుతో ఒక లక్ష మొక్కలు నాటాలని సంకల్పంతో నేటి వరకు 3000 మొక్కలు పంపిణి చేశామని తెలిపారు. ఈ సందర్భంగా మొక్కల సంరక్షకులు దైద వెంకన్న మాట్లాడుతూ....... మనం ఈ రోజు ఇంత అందంగా జీవిస్తున్నము అంటే కారణం అమ్మ. అందుకే ప్రతి ఒక్కరు మీ అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. అమ్మకు మించిన దైవం ఏది మనకు లేదు. అంతరించి పోతున్న జీవవైవిధ్యాన్ని రక్షించాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందని అన్నారు. మీకు మొక్కలు కావాలి అంటే మా ఇంటి వద్ద మీకు ఇచ్చేందుకు మొక్కలు ఉన్నాయని తెలిపారు.

## పేదోడి గుండెచప్పుడు విన్న కాంగ్రెస్ ప్రభుత్వం... ఎమ్మెల్యే డా.మురళీ నాయక్

**ఏర్రకుంట తండ గ్రామంలో నిర్వహించిన నూతన సీసీ రోడ్ల నిర్మాణ మరియు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు మరియు రేషన్ కార్డులు అర్హత కల్గిన వారి జాబితా ఆమోదించుకొనుట కొరకు గ్రామ సభ నిర్వహణ కార్యక్రమంలో పాల్గొన్న**

**మహబూబాబాద్ ఎమ్మెల్యే శ్రీ డా భూక్యా మురళీ నాయక్**




మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ జనవరి 22 గూడూరు మండల కేంద్రంలో ఏర్రకుంట గ్రామంలో నూతన సీసీ రోడ్ల నిర్మాణ మరియు ప్రజాపాలన గ్రామసభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మహబూబాబాద్ ఎమ్మెల్యే డా "భూక్యా మురళి నాయక్ గారుఈ ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 4 పథకాలు ఇందిరమ్మ ఇళ్లు,రేషన్ కార్డులు,రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విషయంలో ప్రజలు ఎవరు అందోళన చెందవద్దు.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధి జరుగుతుంది. నుండి గ్రామాల్లో గ్రామ సభలు,వార్డు సభలు జరుగుతుండడంతో అక్కడికి వెళ్లి అధికారుల వద్దకు రేషన్ కార్డులు రానివారు కానీ,ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక విషయంలో గ్రామ సభల్లోనే ఎంపిక చేయనున్నారు. ఎవరికైనా అర్హత ఉండి రానివారు ఉంటే గ్రామ సభలో అప్లికేషన్ లు పెట్టుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.పంచాయతీ కార్యదర్శిలు గత ప్రభుత్వంలో టిఆర్ఎస్ నాయకులతోనే వాళ్ళు కుమ్మక్కై వాళ్ళ అన్నదండలో పని చేస్తున్నారు అన్ని అన్నారు. ఊర్లలో నిజమైన లబ్ధిదారులు ఎవరైతే ఉన్నారో వాళ్లను పట్టించుకోకుండా వాళ్లు గత ప్రభుత్వాలు చేసినట్టుగా ఇప్పుడు ఈ



సర్వేలు ఈ దరఖాస్తులు స్వీకరించడం జరుగుతోంది కావున అధికారులకు హెచ్చరించడం జరిగింది ఈ సారి ఏ గ్రామంలోనైనా నిజమైన లబ్ధిదారుడి పేరు గనక లబ్ధిదారుల లిస్టులో లేకపోతే అదే విధంగా లబ్ధిదారులు కాకున్నా ఆయన పేరు లిస్టులో గనక ఉంటే మన అధికారులకు వాళ్లందర్నీ టెర్మినేట్ చేసే విధంగా మనం ప్రభుత్వ దృష్టి తీసుకెళ్తారని చెప్పడం జరిగింది అందుకే అధికారులు అందరూ ఒళ్ళుంచి అన్ని అప్లికేషన్ తీసుకొని గ్రామ గ్రామాలలో మీకు ఇచ్చినటువంటి గ్రామాలలో విలేజ్ సెక్రటరీ కావచ్చు అదేవిధంగా స్పెషల్ ఆఫీసర్లు లబ్ధిదారుల లిస్టు తీసుకుని గ్రామం అంతటా తిరిగి లబ్ధిదారులు ఎటువంటి తేడాలు జరగకుండా చూడాలని కోరారు. ప్రజలు చాలా ఉత్సాహంతోటి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అన్ని సంక్షేమ పథకాలు పేదోడికే న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చేపడుతుంది.సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇల్లు,స్మార్ట్ రేషన్ కార్డు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా కార్యక్రమం చాలా విజయవంతంగా జరుగుతుంది నిజమైన లబ్ధిదారులు పేదోడికి ఆయన కన్న కలలు నిజం కావాలని ఇల్లు లేని నిరుపేద రైతులకు ఐదు లక్షల రూపాయలుతో ఇందిరమ్మ ఇల్లులు అదే విధంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో పేద రైతు కూలీకి వందరోజుల పని ఎవరైతే 20 రోజుల కంటే ఎక్కువ పని చేసిన వాళ్లకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో సంవత్సరానికి 12000 రూపాయలు ఇస్తున్నారు.రైతు భరోసా ఎవరైతే వ్యవసాయం చేసుకున్నటువంటి రైతుల ఎవరైతే ఉన్నారో నిజమైన రైతు వ్యవసాయం చేసుకున్న వారికే పంట పెట్టుబడి సాయం ఇవ్వాలని సంవత్సరానికి ఎకరానికి 12000 రూపాయలు అదేవిధంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు అన్నిటిని పేదోడి గుండెచప్పుడు విన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేదోడికి న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది అన్ని అన్నారు.

## గ్రామసభలో టీబీ, ఎయిడ్స్ పై కరపత్రాలు పంపిణి

జనసముద్రం న్యూస్ ప్రతినిధి మధిర జనవరి 22,జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ తరపున జిల్లా మాస్ మీడియా విభాగం నుండి కేంద్రం రాష్ట్ర ప్రభుత్వం ల ద్వారా ప్రజలకు అందిస్తున్న పలు ఆరోగ్యరక్షణ పథకాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ బానోత్ కళావతి బాయ్, డిప్యూటీ డి ఎమ్ అండ్ హెచ్ ఓ డాక్టర్ సైధులు సూచనల మేరకు ప్రజా ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా జన సమూహ ప్రాంతాల్లో మండల పరిధిలో పీహెచ్ సి దెందుకూరు వైద్యులు డాక్టర్ పృథ్వి రాజ్ నాయక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వడ్లముడి వెంకటేశ్వర్లు ద్వారా రోజువారీ విధినిర్వహణలో భాగంగా రాయపట్నం గ్రామ సందర్శన సందర్భంగా ఆరోగ్య పరివేక్షకులు లంకా కొండయ్య, హెచ్ఎస్ సుబ్బలక్ష్మి పారా మెడికల్ బృందం సంయుక్తఒ గా గ్రామసభలో హాజరైన ప్రజలకు టీబీ (క్షయ వ్యాది ) హెచ్ఐవి /ఎయిడ్స్ వ్యాదుల పై అవగాహన కర పత్రాలు ప్రత్యేకముగా లంకా కొండయ్య ఫ్లెక్సీ బ్యానర్ లు ద్వారాసంపూర్ణ%శీ%గా ఈ జంట జబ్బులు గురించి అవగాహన పరిచినారు. అదేవిధంగా కరపత్రాలను మధిర కిండ్లి స్వచందసంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి అనూష అవగాహన నిమిత్తం ముద్రించి లంకా కొండయ్యకు అందజేయ గా వాటిని జనసమూహ%శీ% లో పంచుతూ ప్రజలను చైతన్య పరుస్తూన్నారు. ఈ కార్యక్రమంలో మహాదేవపురం సబ్ సెంటర్ ఎఎన్ఎమ్




విజయకుమారి ఆశ కార్యకర్తలు నానమ్మ విజయ, గ్రామ యూత్ ఐకేపీ జిపి సిబ్బంది గ్రామ ప్రజలు తది తరులు పాల్గొన్నారు.

## రాఘవపురం గ్రామంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించాలి-జక్కినగేష్

**అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించాలని బిఆర్ఎస్వి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కినగేష్ ప్రభుత్వానికి డిమాండ్ చేశాడు**

యాదాద్రి భువనగిరి జిల్లా జనవరి. 22,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:

జనసముద్రం న్యూస్ బీబీనగర్ మండల పరిధిలో రాఘవపురం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామసభ నిర్వహించడం జరిగింది. గ్రామ సభకు విచ్చేసిన జిల్లా కలెక్టర్ హనుమంతు రావుకి బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. 1.కొత్త రేషన్ కార్డులు,2.ఇందిరమ్మ ఇండ్లు,3.రైతు భరోసా,4.ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ప్రజాపాలనలో గ్రామ ప్రజలు దరఖాస్తు చేసుకున్నవారు. సందర్భంగా జక్కి నగేష్ మాట్లాడుతూ ప్రజాపాలన కాదు,మీది ముమ్మాటికి ప్రజావ్యతిరేక పాలన. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశాల్లో మిత్రులందరికీ పక్క రాష్ట్రాల్లో బిజీగా ఉంటూ ప్రజలు ఎవరు పట్టించుకోవడం లేదు. ఇందిరమ్మ రాజ్యంలో పోలీసు పహారా నడుమ గ్రామసభలు నిర్వహించలిన దుస్థితి రావడం దారుణమని అన్నారు. రుణమాఫీ రైతు భరోసా పంట బోనస్,ఇంద్ర మైండ్లు రేషన్ కార్డులు అర్హులైన వారందరికీ ఇస్తామని చెప్పి ఇప్పుడు భారీగా కోతలు తీస్తే ప్రజలు తిరగబడకుండా ఏం చేస్తారు. అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని రైతులందరికీరైతుబంధు అందించి కౌలు రైతులకు ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా సంవత్సరానికి 12000/– అందించాలని ప్రభుత్వానికి కోరారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారెంటీలను సక్రమంగా అమలు చేయాలని,నిబంధన పేరుతో ప్రభుత్వం



ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం లబ్ధిదారును తగ్గించే ప్రయత్నం కుట్ర చేస్తుందని అన్నారు. గ్రామాలలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు దొంతి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి,గుంటిమిది అశోక్,బుయ్య కిషోర్ గౌడ్,సుర్వి బసవరాజు గౌడ్,బుయ్య అశోక్,బండారు రాఘవేందర్ గౌడ్,వంగరి రమేష్,శివగోని రంగయ్య గౌడ్,జక్కి నరసింహ,రాగి జగదీష్,దొంతిరెడ్డి రాజశేఖర్ రెడ్డి,దొంతిరెడ్డి శంకర్ రెడ్డి,దొంతిరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి,దశరథ రెడ్డి,దొంతిరెడ్డి సత్తిరెడ్డి, అంజిరెడ్డి,పబ్బతి లక్ష్మయ్య,బిజిలి యాదగిరి,బుయ్య యోగేశ్వర్ గౌడ్,గుంటిమీది జంగయ్య,రవి శివగోని సుదర్శన్,గోల్కొండ గంగులు,అంబటి పాండు,సురేష్ యాదవ్ పాల్గొన్నారు.

## అంతిమ దహన సంస్కారాలకు ఆమడ దూరంలో కొత్తపల్లి

**అసంపూర్తి నిర్మాణం, సరిపడా నిధులు లేక దహన సంస్కారాలకు గ్రామస్తుల ఇబ్బందులు**

**స్మశాన వాటికకు తగినన్ని నిధులు కేటాయించాలని గ్రామస్తుల వేడుకలు.**

(జనసముద్రం న్యూస్ కరీంనగర్ ప్రతినిధి జనవరి 22) హుజురాబాద్ (కొత్తపల్లి) : హుజురాబాద్ పట్టణానికి కూత వేటు దూరంలో ఉన్న ఆ గ్రామానికి ప్రజలకు కావలసిన కనీస సౌకర్యాలు లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం అంతిమ సంస్కారాలను నిర్వహించడానికి కూడా సరైన సౌకర్యాలకు గ్రామస్తులు నోచుకోకపోవడం బాధిస్తోంది. గత పదిఏళ్ల క్రితం బిఆర్ఎస్ ప్రభుత్వం గ్రామానికి అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు స్మశాన వాటికను మంజూరు చేయగా సరిపడ నిధులు లేకపోవడంతో అసంపూర్తిగా మిగిలింది. ఆ నిధులతో రెండు చితి పేర్చే గదులను నిర్మించారు. అప్పటి టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆకుల రవి కృషితో స్మశాన వాటిక వద్ద బోరు, మోటారు మంజూరు చేయగా ఏర్పాటు చేశారు. అయితే స్మశాన వాటికను రోడ్డుకు లెవెల్ గా నేర్పకపోవడం, చితి గదులను ఎత్తులో ఏర్పాటు చేసి చుట్టూ చెట్లు చెదారం పెరిగి పాములకు, తేళ్లకు ఇతర జంతువులకు విష సర్పాలకు నిలయంగా మారింది. దీంతో గ్రామస్తులు ఎవరైనా మృతి చెందితే దహన సంస్కారాలు అక్కడ చేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్మశాన వాటికకు సుమారు 8 గుంటల స్థలం కేటాయించగా దానికి హద్దులు పెట్టకపోవడం, చుట్టూ కాంపౌండ్ వాల్ లేకపోవడం, కంకర కుప్పలు, మొరం, రాళ్లు రప్పలు ఉండడంతో



అంత్యక్రియలు నిర్వహించాలంటేనే అటువైపు వెళ్లడానికి ప్రజలు జంకుతున్నారు. ద్వారము వద్ద పశువులను కట్టేసి పశువుల కొట్టంగా వాడుకుంటున్నారు. ఏపుగా పెరిగిన ముళ్ళ చెట్లు గుంతలతో స్మశాన వాటిక పూర్తిగా నిరుపయోగంగా మారింది. గత ఐదేళ్ల క్రితం కొత్తపల్లి గ్రామం మున్సిపాలిటీలోకి కలువగా నాటి నుండి ఎవరు పట్టించుకోకపోగా, ఏడాది క్రితము కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి అధికారులకు, ప్రజాప్రతినిలకు తెలిపిన పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కొత్తపల్లి స్మశాన వాటికకు శాశ్వత కాంపౌండ్ వాల్, స్నానాల గదులు, అదనపు బోరును మంజూరు చేసి ప్రజలకు అంతిమ సంస్కారాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అణువుగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## జాబితాలో పేర్లు రానివారు దరకాస్తులను సమర్పించండి : తహసిల్దార్ మన్నన్

జన సముద్రం న్యూస్ చిన్న శంకరంపేట మండలం జనవరి 22 మెదక్ జిల్లా:

ప్రభుత్వ పథకాలను పొందడానికి లబ్ధిదారుల పేర్లు జాబితాలో లేక పోతే తిరిగి దరకాస్తులను సమర్పించాలని తహసిల్దార్ మన్నన్ తెలిపారు. బుధవారం చిన్నశంకరంపేట మండల పరిధిలోని మాడూర్ గ్రామంలో ఆయన అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు అందించే విధంగా అధికారులు కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రతిభ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రమేష్, భూపాల్, మల్లేష్ ఫీల్డ్ అసిస్టెంట్ సునిత, వేణు గ్రామస్తులు,పాల్గొన్నారు



జనసముద్రం న్యూస్
ప్రతి అక్షరం జనం కోసం
గురువారం23,జనవరి,2025

# ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ను మర్యాదపూర్వకంగా కలిసి చల్వదు సన్మానం - డాక్టర్ ర్యాకల శ్రీనివాస్



జనసముద్రం న్యూస్ జిల్లా ప్రతినిధి :
యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి స్వాతి నక్షత్రం సందర్భంగా గిరి ప్రదక్షణలో పాల్గొనడానికి విచ్చేసిన, భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితను యాదాద్రి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన శాలువాతో ఘనంగా సన్మానించారు జిల్లా బిఆర్ఎస్ నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్,నాయకులుగణేష్ నాకు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో గిరిప్రదక్షిణలో పాల్గొన్న - డాక్టర్ ర్యాకల శ్రీనివాస్

యాదాద్రి భువనగిరి జిల్లా
భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:
జనసముద్రం న్యూస్ జనవరి. 22,
యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ రాష్ట్ర ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని స్వాతి నక్షత్రం సందర్భంగా భారత జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో కలిసి గిరి ప్రదక్షణలో పాల్గొన్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్. స్వాతి నక్షత్రం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.
ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్వామివారి పాదాల వద్ద



ప్రత్యేకపూజలు నిర్వహించి, యాదాబుషివద్దనమస్కరించి, అనంతరం గిరిప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం సమావేశం



జనసముద్రం జనవరి 22: డిండి :
నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం సమావేశాన్ని బుధవారం డిండి మండలంలోని గోనబోయినపల్లి గ్రామంలో గ్రామ పురోహితులు సురభి రఘుచరణ్ నివాసంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కురుమేటి రవిప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను బ్రాహ్మణులందరూ వినియోగించుకోవాలని అన్నారు. అదేవిధంగా రాబోయే విశ్వావసు నామ సంవత్సర పంచాంగ ఆవిష్కరణ మరియు ముద్రణపై చర్చ జరిపి నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు కురుమేటి బిక్షపతి శర్మ,పాల సదాశివశర్మ, గారపాటి భాస్కర,గొట్టిముక్కల గణేష్ శర్మ,కన్వీనర్ కురుమేటి వంశీ,ఉపాధ్యక్షులు బహుగానం చంద్రశేఖర్ శర్మ,కురుమేటి ఉమాశంకర్,సురభి ప్రభాకర్ శర్మ, ఉప్పల శ్రీనివాస్ శర్మ,గాదె కిశోర్,డేరమ్ సతీష్ శర్మ,నెమల్ల వెంకట్ సురభి,శ్రీచరణ్ వెంకటాచార్యులు అజయ్ శర్మ,మీడియా కార్యదర్శి గాదె గిరిధర్,గణేష్ పాండే తదితర బ్రాహ్మణులు పాల్గొన్నారు.

## గాంధారి మైసమ్మ జాతర గోడపత్రుల విడుదల





జనసముద్రం న్యూస్ జైపూర్ జనవరి 22:
వచ్చేనెల 14, 15 16 తేదీలలో బొక్కల గుట్ట గ్రామంలో నిర్వహించే గాంధారి మైసమ్మ జాతర గోడపత్రులను చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మంచిర్యాల డిసిపి భాస్కర్ తో కలసి బుధవారం రోజున వేలాల గ్రామంలో విడుదల చేశారు, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ గాంధారి మైసమ్మ జాతరను గిరిజనులు ఎంతో ఘనంగా జరుపుకుంటారని ప్రభుత్వ పరంగా కూడా జాతరలో ఏర్పాట్లు చేయబోతున్నట్టు తెలిపారు, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో అతిపెద్ద గిరిజన జాతరైన గాంధారి మైసమ్మ జాతరనుఅన్నిశాఖలసమన్వయంతోనిర్వహించబోతున్నట్టు తెలిపారు, ఈ కార్యక్రమంలో ఆదివాసి నాయక్ పోడ్ రాష్ట్ర అధ్యక్షులు గంజి రాజన్న, జిల్లా అధ్యక్షులు పెద్ది భార్గవ్, గాంధారి మైసమ్మ ఆలయ కమిటీ వైస్ చైర్మన్ రమేష్, పూజారి మహేష్, మేషినేని అరుణ్ కుమార్, సిద్ధిని రాజేష్, మనుబోతుల కుమార్, రఘు , అశోక్ పాల్గొన్నారు

## రోడ్డుమరమ్మత్తులు చేపట్టాలి

జన సముద్రం న్యూస్ జైపూర్ జనవరి 22:
జైపూర్ మండలంలోని కుందారం గ్రామంలో గల ఆర్ అండ్ బి రోడ్ పైన గల లో లెవెల్ బ్రిడ్జి వద్ద రోడ్డు పూర్తిగా గుంతల మయంగా తయారయింది, జైపూర్ నుండి సుమారుగా 15 గ్రామాలకు ప్రధాన రహదారిగా ఉండడంతోఆ దారి గుండా ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, వచ్చే నెలలో నిర్వహించే వేలాల జాతరకు ప్రధాన రహదారి కావడంతో అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుచున్నారు



## తెలంగాణ రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయి




(జనసముద్రం న్యూస్ కరీంనగర్ ప్రతినిధి//
జనవరి 22 హుజురాబాద్)
తెలంగాణ రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు తోపాటు రేషన్ కార్డులు తప్పక అందుతాయని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, చైర్ పర్సన్ రాధికలు అన్నారు. తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజా పాలనలో భాగంగా బుధవారం హుజరాబాద్ లోని 15వార్డులో రేషన్ కార్డుల దరఖాస్తు స్వీకరణలో భాగంగా వారు మాట్లాడారు. అర్హులందరికీ రేషన్ కార్డులు అందుతాయని ఎవరు అధైర్య పడవద్దని అన్నారు. గతంలో రేషన్ కార్డుకు అభ్యర్థన పెట్టుకున్న వారిలో కొంతమందికి రాలేదని తెలుస్తుందని అన్నారు. గతంలో రానివారు మున్సిపల్ కార్యాలయంలోకి వచ్చి రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు నిరంతర ప్రక్రియ ఉంటుందని,దీనిపై ఆందోళన అవసరం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉప్పు శ్రీనివాస్,ముద్రవేణి వేణుగోపాల్ ,మండ సాయికుమార్ ,కోడెమ్ నర్సింగ్, గొట్టే జమదగ్ని ,పిట్టల వరుణ్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీని ప్రజలెవరు నమ్మరు
## కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిన మోసాన్ని బట్టబయలు చేయండి.

జనసముద్రం న్యూస్ జనవరి 22.
మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం లో బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు తాత గణేష్ ఆ దేశాల మేరకు ఆ పార్టీ ముఖ్య శ్రేణులు బయ్యారం మండలంలోని 29 గ్రామ పంచాయతీల ప్రజలు రేపు జరగబోయే గ్రామ సభలలో మనకు రావాల్సిన సంక్షేమ పథకాలు అమలు జరిగే విషయంలో ఎందుకు అమలు కావట్లేదని వ్యవసాయ కూలీల మహిళలకు ప్రతి నెల 2500 వికలాంగుల పింఛన్లు ఉచిత గ్యాస్ రైతు భరోసా కాంగ్రెస్ పార్టీ ఏదైతే ఆరు గ్యారెంటీలు చెప్పి అధికారంలోకి వచ్చిందో అవి అమలు చేసే విషయంలోవిఫలమైందని ప్రతి గ్రామపంచాయతీలో ప్రజలు నిలదీసి అడగాలని బి ఆర్ ఎస్ పార్టీ



తరపున ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు ఇస్తానన్న ఆరు గ్యారెంటీ ల వాగ్దానాలు అమలు చేయకపోవడంతో పాటు ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఫేక్ కమిటీలు నిర్వహించి ప్రజలను మోసం చేసిందని ఆయన అన్నారు ప్రతి ఒక్క గ్రామ పంచాయతీలో ప్రజా పాలనలో తీసుకున్న దరఖాస్తులుఏమయినాయిమళ్లీ తిరిగి గ్రామసభలలో దరఖాస్తులు ఎందుకు అడుగుతున్నారని అడగాలని ఆయన డిమాండ్ చేశారు కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితులు లేరని రేపు జరగబోయే స్థానిక ఎలక్షన్ల కోసం హైడ్రామాడుతుందని ప్రజలు ఎవరు కూడా మోసపోవద్దని ఆయన మాట్లాడారు. ఇప్పుడు కొత్త రేషన్ కార్డుల విషయంలో అదే జరుగుతుందని ఎవ్వరు కూడా మోసపోవద్దని ప్రజలకు తెలియజేశారు రాబోయే స్థానిక ఎలక్షన్లో కాంగ్రెస్ పార్టీకితగినబుద్ధిచెబుతారని ఆయన ఎద్దేవా చేశారు.

# ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న సంక్షేమ పథకాలు చివరి అర్హునికి చేరేవరకు ప్రక్రియ కొనసాగుతుంది
## అనర్హులు లబ్ధి పొందితే విచారణ చేసి తొలగిస్తాం:కలెక్టర్ హనుమంతరావు

యాదాద్రి భువనగిరి జిల్లా
జనవరి. 22,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:
జనసముద్రం న్యూస్ భూదాన్ పోచంపల్లి:- ప్రభుత్వం ఈనెల 26న ప్రవేశపెట్టనున్న 4 ప్రజా సంక్షేమ పథకాలు చివరి అర్హునికి చేరేంతవరకు ప్రక్రియ కొన సాగుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు.
వార్డు,గ్రామసభల నిర్వహణలో భాగంగా భూదాన్ పోచంపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని 4వ వార్డులోబుధవారం నాడు వార్డు సభ నిర్వహించారు. కలెక్టర్ హాజరై ప్రజల విన్నపాలు విని,పలువురి వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించారు.పలు అంశాలను వార్డు ప్రజలు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ కార్డులు చివరి అర్హునీ వరకు ఇవ్వబడతాయన్నారు.
గ్రామాలలో 1.50,పట్టణ ప్రాంతాల్లో 2.2 లక్షలు సంవత్సర ఆదాయం కలిగి ఉన్నవారికి రేషన్ కార్డ్ ఇవ్వబడుతుందన్నారు. 4చక్రాల వాహనం ఉన్నవారికి ఇవ్వబడదు అన్నారు.అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వబడుతుందన్నారు.
ఇందిరమ్మ ఇండ్లలో అర్హత ఉన్న ,ఇల్లు లేని ప్రతి ఒక్కనిరుపేదకుఇందిరమ్మఇల్లుఇవ్వబడుతుందన్నారు .స్థలం ఉండి,అర్హతలు ఉన్న,ప్రతి పేదవానికి నిబంధనల మేరకు ఇల్లు కట్టుకోవడానికిఅవకాశం కల్పించబడుతుందన్నారు.
ఆత్మీయ భరోసా పథకం కింద జాతీయ ఉపాధి హామీ పథకంలో 20 పని దినాలు చేసిన నిజమైన





కార్మికునికి వర్తింప చేయడం జరుగుతుందన్నారు. రైతుభరోసారైతులందరికీఇవ్వడంజరుగుతుందన్నారు .కేవలం వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఇంచ్ భూమికి(వ్యవసాయపెట్టుబడి)ఇవ్వడంజరుగుతుందన్నారు. వ్యవసాయ యోగ్యమై ఉండి సంవత్సరం పడావుపడ్డ భూమికి కూడా రైతు పెట్టుబడి ఇవ్వబడుతుందన్నారు. ఈ పథకాలు పొందేందుకు అర్హులై ఉన్నప్పటికీని రాని ఎడల తిరిగి దరఖాస్తు చేసుకోవాలని,చివరి అర్హునికి చేరేంతవరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అనర్హులై ఉండి లబ్ధి పొందిన ఎడల గ్రామసభ దృష్టికి తేవాలని,విచారణ చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో గ్రామ సభలు ప్రశాంతంగా జరుగుతున్నాయని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చిట్టిపోల్ విజయలక్ష్మి శ్రీనివాస్,వైస్ చైర్మన్ బాత్ క లింగస్వామి,కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్,కౌన్సిలర్ పెద్దల చక్రపాణి,కాంగ్రెస్ నేతలు తడక రమేష్,కడవేరు వెంకటేశం,కుక్క కుమార్, లింగస్వామి,శీను తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలోని వంకమామిడి,ధర్మారెడ్డి పల్లిలో జరిగిన గ్రామ సభలలో కాంగ్రెస్ నేత సామ మధుసూదన్ రెడ్డి పాల్గొనగా,కనుముకుల గ్రామంలో జరిగిన గ్రామసభలో కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని 7వ11వ వార్డులలో,మండల పరిధిలోని పెద్దగూడెం,జూలూరు,దంతూర్ గ్రామాలలో గ్రామసభలు నిర్వహింపబడ్డాయి.
మండల,గ్రామస్థాయి అధికారులు,మాజీ ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్న ఈ సభలలో గ్రామస్తులు హాజరై దరఖాస్తులు అందజేసి,గ్రామాలలో నెలకొన్న సమస్యలను ఏ కరవుపెట్టారు.

## వేలాల జాతరపై సమీక్ష సమావేశం





జనసముద్రం న్యూస్ జైపూర్ 22:
జైపూర్ మండలంలోని వేలాల గ్రామంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని నిర్వహించే వేలాల జాతరపై బుధవారం రోజున చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల డిసిపి భాస్కర్, సమీక్ష సమావేశం నిర్వహించారు, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ వేలాల గ్రామంలో మహాశివరాత్రి పురస్కరించుకొని నిర్వహించే జాతరకు సుమారుగా 4 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, కాబట్టి వేలాల గుట్ట పైన గుట్ట కింద జరిగే జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు, జాతరలో విఐపి దర్శనాలను అనుమతించవద్దన్నారు, దేవుని దగ్గర అందరూ సమానమే అన్నారు, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ వేలాలలో మహాశివరాత్రి ని పురస్కరించుకొని నిర్వహించే జాతరకు ఏర్పాట్లను అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఏర్పాటు చేస్తున్నట్టు, జాతరలో పారిశుద్ధ పనులను ఎప్పటికప్పుడు చేపట్టనున్నట్టుత్రాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు, ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, మంచిర్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి గూడూరి శ్రీనివాసరావు, జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు, జైపూర్ ఎమ్మార్వో వనజ రెడ్డి, ఎంపీడీవో గుర్రం సత్యనారాయణ సింగరేణి అధికారులు కె ఎస్ ఎన్ ప్రసాద్ ఏజీఎం (సివిల్):మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపూరావు, ఆర్డబ్ల్యూఎస్ డిఈ విద్యాసాగర్, విద్యుత్ శాఖ ఏఈ మనోహర్, శ్రీరాంపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వేణు చందర్, జైపూర్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్, జైపూర్ మండల కాంగ్రెస్ నాయకులు, చల్ల విశ్వంభ రెడ్డి చల్ల, సత్యనారాయణ రెడ్డి, దేగ నగేష్, గూడెల్లి శ్రీనివాస్ రెడ్డి, కిరణ్ గౌడ్, ప్యాగా లక్ష్మణ్, చందుపట్లపాపిరెడ్డి,వెంకట్ స్వామి గౌడ్ పాల్గొన్నారు

# జన్నారం ఎంపీడీవో ఆఫీస్ ముందు ధర్నాకు దిగిన
## కామన్ పెల్లి ఎస్ టి నాయక పోడు కాలనీవాసులు

జనసముద్రం న్యూస్ జన్నారం.
మంచిర్యాల జిల్లా జన్నారం జనవరి 22:
బుధవారం రోజున జన్నారం మండలంలోని కామన్ పెల్లి గ్రామానికి చెందిన ఎస్ టి నాయక పోడు కాలనీలో సుమారుగా 15 కుటుంబాలు గత 80 సంవత్సరాలుగా జీవనం కొనసాగిస్తున్నప్పటికీ మాకు ఇప్పటి వరకు ఇందిరమ్మ భరోసా కార్యక్రమంలో ఎలాంటి పథకాలు అమలు కాలేదని ఇందిరమ్మ భరోసా కార్యక్రమంలో మా కాలనీకి చెందిన ఒక కుటుంబం పేరు కూడా రాలేదని ఇప్పటివరకు ఆ జాబితాలో మాకు సర్వే జరగలేదని తేదీ21.1.2025 రోజున జరిగిన ఇందిరమ్మ కార్యక్రమంలో ఇండ్లు గాని రేషన్ కార్డులు గాని ఆత్మీయ భరోసా గ్రామసభ ఉన్నదని మాకు ఇంతవరకు సమాచారం లేదని వారు ఆపోయారు అయినప్పటికీ మాకు గ్రామ సభ జరుగుతుందని మా కాలానికి సమాచారం ఇయ్యలేదు మాకు గ్రామ సభ ఉందని పంచాయతీ సెక్రెటరీ చెప్పకుండా



వారికిఇష్టం వచ్చిన రీతిలో వ్యవహరిస్తూ మమ్ములను ఆ కాలనీలో మేమున్నామని గుర్తించకుండా మేము పిలిచిన పలకకుండా వెళ్ళిపోతున్నారని ఈరోజు జన్నారం మండలంలో ఎంపీడీవో ఆఫీస్ ముందు ధర్నాకు దిగడం జరిగిందని వారు వాపోయారు ఇప్పటికైనా మండల ఎంపీడీవో స్పందించి కామన్ పల్లి పంచాయతీ సెక్రెటరీ పై తగిన చర్యలు తీసుకొని ఇందిరమ్మ జాబితాలో మమ్ములను చేర్చి మాకు ఇండ్లు రేషన్ కార్డులు ఆత్మీయ భరోసా వచ్చేలా చూడాలని వారు జన్నారం ఎంపీడీవో ను కోరారు

# మెగా ఉచిత గుండె,కిడ్నీ ఎముకల వైద్య శిబిరం

జనసముద్రం న్యూస్ జనవరి 23
హుజూర్నగర్ నియోజకవర్గం అలవాల రవి

హుజూర్నగర్ పట్టణ టౌన్ హాల్ లో చేయూత పాస్టర్స్ ఫెలోషిప్, హుజూర్నగర్ నియోజకవర్గ మరియు పట్టణ పాస్టర్స్ ఫెలోషిప్ వారి ఆధ్వర్యంలో ఐఎన్టీయూసీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఎరగాని నాగన్నగౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తన్నీరు మల్లికార్జున రావు సౌజన్యంతో ఏర్పాటుచేసిన మెగా వైద్య ఉచిత శిబిరంలో అపోలో హాస్పిటల్ జూబ్లీహిల్స్ హైదరాబాద్ కు చెందిన డాక్టర్స్ ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కరుణాకర్ రాపోల్ గారు, ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ జి సత్యనారాయణ గారు, ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ కిరణ్ వర్మ ఉద్దరాజుగారు మరియు హైదరాబాద్ నుండి వచ్చిన మహిళ వైద్యులు వైద్య శిబిరానికి ఆరోగ్య సంబంధిత ఇబ్బందులతో పాల్గొన్న 470 మందిలో అవసరమైన వారికి ఈసీజీ, 2D ఎకో, యూరిన్ ఎగ్జామినేషన్, క్రియాటినం పరీక్షలు ఉచితంగా నిర్వహించి



హాజరైన ప్రతి ఒక్కరికి ఆరోగ్యానికి సంబంధించిన ఇబ్బందులను పరిశీలించి ఉచితంగా వైద్య సహాయం అందించడం జరిగింది..

కార్యక్రమ నిర్వాణ పాస్టర్ K.J ఉదయ బాబు, అధ్యక్షత నా టి కృపానందం, కే సతీష్, ఆర్ ఫిలిప్స్, యోహాన, పి సుందర్ రావు, జి సామేలు, ఎల్ జాన్ వెస్లీ కార్యక్రమాన్ని పరిశీలించగా అతిథులుగా ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్నగౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తన్నీరు మల్లికార్జునరావు, నేరేడుచర్ల ex జడ్పీటీసీ రాపోలు నరసయ్య హుజూర్నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, పట్టణ ఎస్సై ముత్తయ్య గారు, కోడి ఉపేందర్ యాదవ్, మేళ్లచెరువు ముక్కంటి. వైద్య శిబిరాన్ని ప్రారంభించి,ప్రజలు ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేసి. వైద్య శిబిరానికి ఉచితంగా సేవలందించడానికి హైదరాబాద్ నుంచి వచ్చినటువంటి డాక్టర్స్ బృందానికి శాలువా పూలబుకేలతో ఘనంగా సన్మానించడం జరిగింది..

ఈ కార్యక్రమంలో స్థానిక పాస్టర్స్ డేవిడ్, పాల్, సుధాకర్,గండు సామెల్, దేవ సాయం, రవికాంత్, రాజు, అనోక్, తదితరులు పాల్గొన్నారు వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఉచితంగా వైద్య సాయం అందించడం పట్ల హర్షం వ్యక్తం చేసినారు

# ఘనపురం గ్రామ కాంగ్రెస్ కమిటి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

**-ముఖ్య అతిథులుగా పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్,మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్**

మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా (జనవరి.22)

జనసముద్రం న్యూస్ ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని ఘనపురం గ్రామ కాంగ్రెస్ కమిటి నూతన సంవత్సర–2025క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనపురం గ్రామ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు వేములరాజుగౌడ్ ఆధ్వర్యంలో ఘనపురం గ్రామంలో ఘనంగానిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్,ఘట్కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ విచ్చేసి నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించడం



జరిగింది.ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మామిళ్ళ ముత్యాల్ యాదవ్,మాజీ సర్పంచ్లు నానావత్ రూప్ సింగ్ నాయక్,వేముల మమత గౌడ్,మాజీ ఉప సర్పంచ్ వేములపరమేష్గౌడ్,జిల్లాకార్యదర్శిఉల్లిఆంజనేయు లుయాదవ్,మున్సిపల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల గోవర్ధన్గౌడ్,గుర్జకుంటనర్సింహా,వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్క ప్రభాకర్ రెడ్డి,ఘట్కేసర్ మండల ఓబిసిసెల్అధ్యక్షులుమెట్టురమేష్,మేడ్చల్నియోజకవ ర్గం ఎస్టి సెల్ అధ్యక్షులు నానావత్ సురేష్ నాయక్,మేడ్చల్ నియోజకవర్గంబిబ్లాక్ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు బర్ల అనిత,ఘట్కేసర్ మండల మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు పైళ్ల లత రెడ్డి,మాజీ వార్డు సభ్యులువేములశంకర్గౌడ్,చిలుగురి భాస్కర్,వెంకట్ నారాయణ ముదిరాజ్,ఘట్కేసర్ మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవ రెడ్డి,ఎన్ఎస్యుఐజిల్లామాజీకార్యదర్శినానావత్శివాజీ నాయక్,కాంగ్రెస్ పార్టీ నాయకులు వేముల వెంకటేష్ గౌడ్,తాటికొండ మల్లేష్ గౌడ్,వేముల రాజు గౌడ్,వేముల విక్రమ్ గౌడ్,వేముల ప్రకాష్ గౌడ్,బోనకుర్తి హన్మంతు,గడ్డం శ్రీనివాస్,చిలుగురి మల్లేష్,బత్తుల రాజు గౌడ్,మంగ ప్రవీణ్ మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘట్కేసర్ మున్సిపాలిటీ ఈడబ్ల్యూఎస్ కాలనీలో గ్రామసభలో జనం తిరుగుబాటు

మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా (జనవరి.22)

జనసముద్రం న్యూస్ ఘట్కేసర్ మున్సిపాలిటీ 9వ వార్డు ఈడబ్ల్యూఎస్ కాలనీలో ప్రజా పాలన గ్రామసభలోజనంతిరుగుబాటుతోఅధికారులు,అధికా ర పార్టీ నాయకులు ఉక్కిరి బిక్కిరి అయ్యారు.

ఘట్కేసర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ స్థానిక కౌన్సిలర్ పలుగుల మాధవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇల్లు లిస్టులో అధికార పార్టీ నాయకుల పేర్లు రావడంతో ప్రజలు ఆగ్రహంతో అధికారులను ఇందిరమ్మ కమిటీ సభ్యులను నిలదీయడం జరిగింది.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీలు ఇచ్చి మాకు మోసం చేసి అధికారంలో వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ నాయకులకె సంక్షేమ పథకాలు అందుతున్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారు.ఎవరు వస్తారో రాని ఏం



మొహం పెట్టుకొని మళ్ళీ ఓట్లు అడుగుతారు అని ఆవేశంతో అన్నారు.ఇంత అసమర్థ పాలన ఎప్పుడూ చూడలేదని కనీసం పేదవారిని గుర్తించలేని స్థితిలో ప్రభుత్వం ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు.తిరిగి రీ ఎంక్వయిరీ చేసి లబ్ధిదారుల ఎంపిక చేయాలని ప్రజలు కోరుతున్నారు పోలీసుల జోక్యంతో సభను అధికారులుతూతూమంత్రంగానిర్వహించివెళ్లిపోయా రు.ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మున్సిపాలిటీ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్,కౌన్సిలర్లు బేతాళ నర్సింగ్ రావు,బండారి ఆంజనేయులు గౌడ్,ఘట్కేసర్ మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్ గౌడ్,ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ పరశురాం,ఎస్సై ప్రభాకర్ రెడ్డి, నాయకులు పల్లె విజయ్ గౌడ్,ఎండి.నజీర్, దేవరకొండ పద్మ,రాజా చారి,అబ్బగోని మీనా ఆనంద్ గౌడ్,వీరేష్ గుప్తా,మడిపడిగే లక్ష్మయ్య, సిల్వేరు కిరణ్,బానుక నవీన్,రాజేష్ గౌడ్,బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా సభ్యులు ఎండి సిరాజ్, లబ్ధిదారులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సమత ఫౌండేషన్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఆత్రం సుగుణక్క

ఖానాపూర్ నియోజకవర్గం జనసముద్రం న్యూస్

ఉట్నూర్: నిర్మల్ జిల్లా నర్సాపూర్ (జి) మండల కేంద్రంలో బుధవారం సమత ఫౌండేషన్ క్యాంప్ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క పాల్గొన్నారు.హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ,జిసిసి చైర్మన్ కోట్నాక తిరుపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు విట్టల్ రెడ్డి,నారాయణరావు పటేల్ లతో కలిసి సమత ఫౌండేషన్ కార్యాలయంలో సుగుణక్క ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సుగుణక్క మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ పేదవారికి, అట్టడుగు వర్గాల వారికి సేవ చేయటం అభినందనీయమని కొనియాడారు. రాబోవు రోజుల్లో సమతా సుదర్శన్ మరింత మంది పేదలకు సేవ చేయాలని, రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమ అనంతరం నిర్మల్ జిల్లా







కేంద్రంలో సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ నూతన గృహప్రవేశానికి సుగుణక్క హాజరై ప్రత్యేకంగా పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో సమత ఫౌండేషన్ సభ్యులు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ మండల నూతన అధ్యక్షులుగా మొగులయ్య మొగిలిపల్లి ఎన్నిక ఏకగ్రీవం

జనసముద్రం న్యూస్ జనవరి 22

చౌడపూర్ మండల కేంద్రంలో నూతన ఎమ్మార్పీఎస్ కమిటీ ఏకగ్రీవంగా మొగులపల్లి. మొగులయ్యను ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులు చెన్నయ్య కొత్తపల్లి,ఉపాధ్యక్షులు,బాలరాజు లింగంపల్లి, మాసయ్య, మల్కాపూర్ తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి. లింగం,యాదయ్య, కార్యదర్శి, ఆంజనేయులు వీరాపూర్, ఈ కార్యక్రమంలో మందిపాల్ వెంకట్ తెలంగాణ పంచాయతీ రాజ్ కార్యదర్శి, చౌడాపూర్ మండలం అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పరిగి అశోక్, మండల ప్రధాన కార్యదర్శి కుమార్, సలహాదారులు. రాములు, చెన్నయ్య, మల్కయ్య, బాలకృష్ణ,శ్రీకాంత్,పెంటయ్య, బన్నీ, కృష్ణయ్య, మహేష్, చౌడాపూర్ మండలం అంబేద్కర్ యువజన సంఘం



అధ్యక్షులుప్రభు, ఉప అధ్యక్షులు సుందరకాండ, విజయ్, ప్రభాకర్,జంగయ్య,గణేష్,శీను,యాదయ్య,చందు, ప్రశాంత్, శీను వెంకటేష్, ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన ఎమ్మార్పీఎస్ అధ్యక్షన్ని వెన్నుకోవడం జరిగింది.

# దరఖాస్తు చేసుకున్న వారి పేర్లను వివరించిన గ్రామసభ అధికారులు

జనసముద్రం న్యూస్ జనవరి 23
హుజూర్నగర్ నియోజకవర్గం అలవాల రవి



హుజూర్ నగర్ పరిధి గోవిందాపురంలో ఎనిమిదవ వార్డ్ కౌన్సిలర్ చిలకపత్తిని సౌజన్య ధనుంజయ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కోతిసంపత్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వోగం చేసుకోవాలని అర్హులైన ప్రతి ఒక్కరికి విడతలవారీగా ప్రభుత్వ పథకాలు అందుతాయని దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని వారు తెలియజేశారు అదేవిధంగా సంబంధిత అధికారులు ప్రజాపాలనను దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు సభముఖంగా చదివి వినిపించారు పేరు రాని వారు మరల దరఖాస్తు చేసుకోవాలని త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తారని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# అర్హులందరికీ ప్రజా సంక్షేమ పథకాలు అందేలా చూడాలి
## -కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవి మహిపాల్ గౌడ్




మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా (జనవరి.22)

జనసముద్రం న్యూస్ ఘట్కేసర్ మున్సిపాలిటీ ఎన్ ఎఫ్ సి నగర్ 2వ వార్డులో కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన వార్డు సభలో చైర్ పర్సన్ ముల్లి పావని,వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్,మేనేజర్ వెంకటరెడ్డి,ఎస్సై శేఖర్,ఆర్ఐ సాయిరాం,వార్డ్ ఇంచార్జ్ సందీప్,మాజీవార్డుసభ్యులు వడ్లకొండ శివయ్య,రెండవ వార్డ్ ప్రెసిడెంట్ బిఆర్ఎస్ జనగామ యాదగిరి రావు,సోషల్మీడియాసి రాజ్,నాగరాజు సజల,చందుపట్ల గూడెం,బీజేపీ మండల అధ్యక్షులు మహిపాల్ రెడ్డి సల్లా శివ,శశికళ,మహిళలు,పెద్దలు,కాలానివాసులు,లబ్దిదారు లు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలని అందజేయాలి.

పెన్షన్,రేషన్ కార్డ్స్,ఇందిరమ్మ ఇండ్ల పంపిణి నిరంత ప్రక్రియ ని చెప్పటి ప్రభుత్వము చేపట్టాలి అని చెప్పడము జరిగింది.

# ప్రజాప్రభుత్వంలో అందరికి సంక్షేమ పథకాలు
## ముద్ధం తిరుపతి గౌడ్



చొప్పదండి(జనసముద్రం న్యూస్):

మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ముద్ధం తిరుపతి గౌడ్ మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో అందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయి, ఈ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వంలో జనవరి 26 రోజు న ప్రారంభిస్తున్న సంక్షేమ పథకాలు రేషన్ కార్డ్, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన ప్రతి ఒక్కరికి కచ్చితంగా అందుతాయని అనుమానం అవసరం లేదని ప్రతిపక్షాల నయవంచన మాటలు ఎవరు నమ్మవద్దు అని గత పది సంవత్సరాలు దొరల పాలనలో ఒక రేషన్ కార్డు ఇచ్చిన పాపానికి పోలేదని అలాగే డబుల్ బెడ్ రూమ్ రైతు రుణమాఫీ ఏది కూడా ఇదిగో ఇస్తాం అదిగో ఇస్తామని కాలం వెళ్లదీశారని, కానీ ఈ ప్రజా ప్రభుత్వంలో అలా కాదని ఇదివరకే మహిళలకు ఉచిత బస్సు, 500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లు దాటిన ఇండ్లకు ఉచిత కరెంటు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజల అభివృద్ధికి కృషి చేయడం జరిగుతుందని మాజీ పట్టణ అధ్యక్షులు ముద్ధం తిరుపతి గౌడ్ అన్నారు.

# జాబితాలో పేర్లు రానివారు దరకాస్తులను సమర్పించండి
## జన్నారం ఎంపీడీవో శశికళ





ఖానాపూర్ నియోజకవర్గం
జనసముద్రం న్యూస్ జనవరి 22

నియోజకవర్గంలోనీ జన్నారం మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ అయినా పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన గ్రామసభలో జన్నారం ఎంపీడీవో శశికళ మాట్లాడుతూప్రభుత్వ పథకాలను పొందడానికి లబ్ధిదారుల పేర్లు జాబితాలో లేక పోతే తిరిగి దరకాస్తులను సమర్పించాలని ఎం పి డి ఒ శశికళ తెలిపారు.

బుధవారం మండల పరిధిలోని మేజర్ గ్రామపంచాయతీ పొనకల్లోఆమె అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు అందించే విధంగా అధికారులు కృషి చేస్తున్నారని ఆమె అన్నారు.కార్యక్రమంలోపంచాయతీకార్యదర్శిరాహుల్,ఇం దిరమ్మకమిటీసభ్యులు గ్రామస్తులు,పాల్గొన్నారు




Published by Rajeshwari Publications,D.No.4-3-99-1,Anantapur 515001 Rege: R.N.I.No APTEL/2021/16151 for Queries Contact us @ 94941 84136, janasamudram2021@gmail.com. Follow us on www.janasamudram.com,fb/janasamudram